ప్రజాశక్తి
మంగళవారం 28 మార్చి 2023
5
కర్నూలు





స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

పత్తి రైతుల ఆందోళన ఉద్రిక్తం

- కలెక్టరేట్ గేట్లను ఎక్కిన రైతులు - పత్తి రైతులకు న్యాయం చేస్తాం - వ్యవసాయ శాఖ జెడి హామీ - విచారణ పూర్తి చేసి రైతులను ఆదుకోవాలి : రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కావేరి జాదు నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. పత్తి రైతులు తమకు పరిహారం ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ గేట్లను ఎక్కి వాటిని తెరుచుకునేందుకు ప్రయత్నించారు. కొంతసేపు రైతులకు పోలీసులకు మధ్య తోపులాట కొనసాగింది. కలెక్టర్ దిగివచ్చి తమకు న్యాయం చేసేంతవరకు ఈ ఆందోళన విరమించేది లేదని పత్తి రైతులు నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. వెంటనే రైతులను పోలీసులు నిలువరించి జిల్లా అధికారులకు సమాచారాన్ని చేరవేశారు. అక్కడికి వ్యవసాయ శాఖ జెడి వరలక్ష్మి చేరుకొని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ నుండి వినతి పత్రాన్ని స్వీకరించారు. వ్యవసాయ శాఖ జెడి. మాట్లాడుతూ పత్తి రైతులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖ కమిషనర్ విచారణ పూర్తి చేసిన అనంతరం రైతులకు పరిహారం అందేలా చూస్తామన్నారు. అంతకు ముందు జరిగిన ధర్నాను ఉద్దేశించి జి.రామకృష్ణ మాట్లాడారు. కావేరి జాదు పత్తి విత్తనాలు వేసి నష్టపోయిన 18 మండలాల్లోని 7288 ఎకరాలలో 1889 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అప్పటి వ్యవసాయ శాఖ అధికారులు 2021 డిసెంబర్ నెలలో నష్టాన్ని అంచనా వేసి ఒక ఎకరానికి రూ.23307 కంపెనీవారు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆర్డర్ ఇచ్చారని తెలిపారు. కంపెనీ వారు నష్టపరిహారం చెల్లించకుండా జాప్యం చేస్తూ కోర్టుకు వెళ్లి స్టేను వేకెట్ చేయించారన్నారు. ప్రస్తుతం వ్యవసాయ కమిషనర్ వద్ద విచారణ జరుగుతుందన్నారు. ఈ విచారణ సక్రమంగా వేగవంతంగా జరగకుండా ఏదో ఒక కారణంతో వాయిదా వేస్తున్నారన్నారు. రైతులు మళ్లీ పంటలు లేక తీవ్రంగా నష్టపోయారన్నారు. కనీసం ఆ నష్టపరిహారమైనా వస్తే కొద్దో గొప్పో రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తక్షణమే కమిషనర్ విచారణను పూర్తి చేసి రైతులకు నష్టపరిహారాన్ని ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. కావేరి జాదు అన్ని రకాల విత్తనాలను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. పత్తి రైతులకు న్యాయం చేయక పోతే వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంను ముట్టడిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, రైతు సంఘం సీనియర్ నాయకులు ఆంజనేయులు, కర్నూలు మండలం కార్యదర్శి మృత్యుంజయుడు తాండ్రపాడు సర్పంచి బాలపీర, కార్మిక సంఘం నాయకులు హుస్సేనయ్య, రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ గేట్లను ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న నాయకులు, రైతులు



నాయకులు, రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జెడి

స్పందన అర్జీలపై...

తహశీల్దార్లు, ఎంపిడిఓలు దృష్టి సారించాలి

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

స్పందన కార్యక్రమంలో వస్తున్న అర్జీలపై తహశీల్దార్లు, ఎంపిడిఒలు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ పి.కోటేశ్వర రావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాధితుల నుంచి కలెక్టర్ వినతలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెన్ కాకుండా, అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సర్వీసులను పెంచాలి

సచివాలయ సర్వీసులను పెంచడానికి తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు ఆదేశించారు. జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గడప గడపకు మన ప్రభుత్వం అనే అంశంపై సమీక్ష నిర్వహిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజా ప్రతినిధులు సూచించిన పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నూతనంగా మంజూరు చేసిన పనులకు సంబంధించి ఫొటోస్ తీసి అప్లోడ్ చేయాలన్నారు. పాఠశాలలో కన్సిస్టెంట్ రిథమ్‌కు సంబంధించి టిక్కెట్స్ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సంక్షేమ సిబ్బంది నిత్యం పాఠశాలలో సమీక్షిస్తూ ఉండాలన్నారు. ఎంపిడిఓలు పూర్తి స్థాయిలో నివృత్తి చేయాలన్నారు. ఎంపిడిఒలు, ఎంఆర్ఓలు శనివారం ప్రతి సచివాలయ సిబ్బంది తనిఖీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలకు రాని వాపట్ల ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో జెడ్పీ సిఇఒ నారప రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రమణ్యం, సిపిఒ అప్పలకొండ, డిపిఒ నాగరాజు నాయుడు, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి

ఇంటి పన్ను తొలగించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 43వ వార్డు ఇందిరా గాంధీ నగర్‌లో ప్రజల చందాలతో నిర్మించిన భగత్ సింగ్ గ్రంథాలయానికి అక్రమంగా వేసిన ఇంటి పన్నును తొలగించాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం స్పందనలో అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సిపిఎం మాజీ కార్పొరేటర్ టి.రాముడు మాట్లాడారు. ఇందిరాగాంధీ నగర్ స్లమ్ ఏరియాలో పేదల పిల్లలు, వయోజనులు చదువుకునేందుకు కొట్టం నిర్మాణం చేశారని తెలిపారు. ప్రజల చందాలతో 19 అడుగుల వెడల్పు 36 అడుగుల పొడవుతో భగత్ సింగ్ గ్రంథాలయం పేరుతో నిర్మించిన చిన్న ఇంటికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రూ.85 ఉండే పన్నును ఆరు నెలలకు రూ.11 వేల వేయడం దారుణమన్నారు. ఇప్పుడు వడ్డీ మాఫీ చేస్తున్నామని రూ.1.71 లక్షల పన్ను బకాయిలు ఉన్నాయని సచివాలయ అధికారులు నోటీసు ఇచ్చారని తెలిపారు. పై కొలతలకు ఇప్పుడు వచ్చిన జిఓ ప్రకారం లెక్క పెట్టి ఆరు నెలలకు రూ.1500 దాటదని, కమిషనర్ ఇందిరాగాంధీ నగర్ వీధి ప్రజలకు ఉపయోగపడుతున్న భగత్ సింగ్ గ్రంథాలయానికి అక్రమంగా వేసిన పన్నును పరిశీలించి రద్దు చేయాలని కోరారు. సిపిఎం మాజీ కార్పొరేటర్ ఎన్.అలివేలు, కెఎస్.పద్మ, ఎస్.చిన్న రోశయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో

ప్రజల చెంతకు వైద్యం

- 16 కొత్త 104 వాహనాలు ప్రారంభం - రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా ప్రజలకు వైద్య సేవలు చేరువ చేస్తుందని కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిన 16 నూతన 104 వాహనాలను మంత్రి, ఎమ్మెల్యేలు, మేయర్, కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా వైద్య సేవలను అందిస్తూ వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో 104 వాహనాల్లో వైద్యులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులు అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఆసుపత్రులను నాడు నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టి ఎంతో మందికి వైద్య సేవలు అందించగా, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కి మరింత ప్రాధాన్యత ఇస్తూ, 3255 వ్యాధులకు వైద్యం అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి దాకా 25 వాహనాలతో 104 వైద్య సంచార వాహనాల ద్వారా గ్రామాలలో పర్యటిస్తూ వైద్యం అందించడం జరుగుతోందని, ఇంకా ఎక్కువ స్థాయిలో వైద్యాన్ని అందించడానికి గాను ప్రభుత్వం మరో 16 నూతన 104 వాహనాలను మంజూరు చేసిందన్నారు. గ్రామాల్లో ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అందిస్తున్న వైద్య సేవలు వినియోగించుకోవాలని మంత్రి కోరారు. జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు మాట్లాడుతూ నెలకు రెండు పర్యాయాలు 104 వాహనం ద్వారా ఒక డాక్టర్, సూపర్వైజర్, ఎఎన్ఎం, ఆశా లు సాధారణ ఆరోగ్య సమస్యలు, గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు, శిశువులకు, రక్త హీనత ఉన్న వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, కిడ్నీ సమస్య ఉన్న వారికి తదితరులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. దీర్ఘకాలిక రోగులు, బాలింతలకు,వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేసుకున్నవారికి వారి ఇంటి వద్దనే చికిత్సలు అందిస్తున్నారని కలెక్టర్ వివరించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ , నగర మేయర్ బివై.రామయ్య మాట్లాడారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం 104 వాహనాల ర్యాలీ రాజ్ విహార్, కొండా రెడ్డి బురుజు, కలెక్టరేట్ మీదుగా తిరిగి ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూధన్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆర్‌డిఒ హరిప్రసాద్, డిఎంహెచ్ఓ రామ గిడ్డయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

వీధి డ్రెయినేజీ కాలువలు నిర్మించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 37వ వార్డు ఉల్సాల రోడ్డు సోమిశెట్టి ఎస్టేట్ లో వీధి కాలువలు నిర్మించి ప్రజలను మురుగు నీటి నుండి కాపాడాలని ఐద్వా జిల్లా కార్యదర్శి, మాజీ కార్పొరేటర్లు ఎన్.అలివేలు టి.రాముడు, వార్డు ఐద్వా నాయకురాలు కెఎస్. పద్మ ఆధ్వర్యంలో కాలనీ ప్రజలు శివాని, లక్ష్మీ, కోటేశ్వరయ్య, సుబ్బమ్మ తదితరులు మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గత సంవత్సరం కురిసిన చిన్నపాటి వర్షానికి సోమిశెట్టి ఎస్టేట్‌లో ఉన్న ఇల్లన్నీ వర్షపునీటితో, మురుగు నీటితో జలమయ మయ్యాయని అన్నారు. కాలనీ ప్రజలందరూ తెల్లవారుజామునే కమిషనర్ ఎ.భార్గవ తేజ ఇంటి ముందు బైఠాయించి సమస్యను పరిష్కరించాలని కోరారన్నారు. కమిషనర్ స్పందించి తప్పకుండా డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారన్నారు. హామీ మేరకు ప్రధాన డ్రైనేజీ కాలువ మాత్రమే నిర్మాణం చేశారని, వీధిలో ఉండే కాలువల నిర్మాణం చేపట్టలేదని, దీని కారణంగా చిన్న వర్షం కురిసినా డ్రైనేజీ నీరు మొత్తం ఇళ్లలోకి పోయే ప్రమాదం ఉందని అన్నారు. కమిషనర్ ఇచ్చిన హామీని అమలయ్యేలా వీధిలో ఉండే డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టి ప్రధాన డ్రైనేజీ కాలువలకు కలపాలని కాలనీ ప్రజల ఇబ్బందులను మానవతా దృక్పథంతో అర్థం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.



వైఎస్ఆర్ ఆసరా చెక్కును అందజేస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

మహిళలకు అధిక ప్రాధాన్యత : హాఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మహిళలకు ఇస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం కర్నూలు ఓల్డ్ సిటీ నందు జమ్మి చెట్టు ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత సంబరాల సభ సందర్భంగా లబ్ధిదారులకు రూ.19.90 కోట్ల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే హాఫీస్ ఖాన్ మాట్లాడుతూ... జగనన్న ప్రభుత్వంలో మహిళలు గర్వంగా బతకగలుగుతున్నారన్నారు. మహిళలకు అన్నగా, తమ్ముడిగా అండగా జగనన్న ఉన్నాడని మహిళలు గట్టిగా నమ్ముతున్నారని అన్నారు. ప్రజల ఇంటి వద్దకే పథకాలను, ప్రజాప్రతినిధులను వచ్చేలా చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డిదని పేర్కొన్నారు. ప్రజలు జగనన్నకు ఓటు వేయడం వల్ల వాలంటీర్ వ్యవస్థ , సచివాలయ వ్యవస్థ , ఆరోగ్య శ్రీ కార్డుల ద్వారా ఆపరేషన్లు తదితర సౌకర్యాలు కల్పిస్తారని అన్నారు. వ్యాపారాలను కాపాడుకోవడానికి తన పలుకుబడిని పెంచుకోవడానికి రాజకీయాల్లోకి రాలేదని , పేద , బడుగు , బలహీన వర్గాలకు న్యాయం చేయడం కోసమే వచ్చానని హాఫీజ్ ఖాన్ తెలిపారు. సీనియర్ నాయకుడు గడ్డం రామకష్ణ ,నగర కార్పొరేటర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, కార్పొరేటర్లు షాషావలి, షాజహాన్ పర్వీన్, అర్షియా పర్వీన్, సుజాతమ్మ, నీలోఫర్, జుబైర్ అహ్మద్, పుల్లమ్మ, యూనుస్ బాషా, ఫారజ్ ఖాన్, కో-ఆప్షన్ మెంబెర్ నయీమ్ పాషా పాల్గొన్నారు.

ఇండ్లు కూలగొట్టి ఏడాదయింది...

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని నరసింహారెడ్డి నగర్ కెసి కెనాల్ వెంట ఏడాది క్రితం కూల్చిన ఇండ్ల వారి సమస్యలు వర్ణనాతీతం అని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ. పుల్లారెడ్డి అన్నారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నరసింహారెడ్డి నగర్, కెసి కెనాల్ ప్రాంతాన్ని పరిశీలించింది. 40 ఏళ్ల క్రితం కట్టుకున్న పేదల ఇల్లు కూలగొట్టి ఏడాది అవుతున్నా ఇండ్ల ముందు కూలగొట్టిన మట్టి తోపాటు, కాల్వ కోసం తొవ్విన మట్టినికూడా దీనిపైనే వేశారు. ఈ మట్టిని తొలగించినట్లు కాంట్రాక్టర్లు బిల్లు చేసుకున్నారని ప్రచారం జరుగుతుందని పుల్లారెడ్డి,నగర నాయకులు షేక్ నౌషాద్,ఎం.నాగరాజు తెలిపారు. ఫుట్‌పాత్ పై జీవించే చిరు వ్యాపారి సెంటు స్థలంలో నిర్మించుకున్న ఇల్లు గృహప్రవేశం చేయకముందే కూలగొట్టారన్నారు.ఇల్లు కూలగొట్టి ఏడాదౌతున్నా కాల్వ కడుతూనే ఉన్నారని, రోడ్డు వేయలేదని, కూలగొట్టగా మిగిలిన మొండి గోడలతో భూకంప బాధితుల్లాగా నరసింహారెడ్డి నగర్, కె సి కెనాల్ బండి పై పేదవాళ్ల పరిస్థితి తయారైందన్నారు. ఇల్లు కూలగొట్టారు కానీ ఈ రోడ్డు ఏ ఇతర రోడ్లకు కలప కుండా వదిలేశారు. దాదాపు రూ.20 లక్షలతో నిర్మిస్తున్న మురుగు కాలువ పాములాగా వంకలు వంకలుగా ఎగుడు దిగుడుగా నిర్మిస్తున్న సంబంధిత ఇంజనీర్లు ఇటుపక్క అడుగు కూడా పెట్టలేదని అన్నారు. కొంతమంది పేదవాళ్లకు ఇంటి స్థలం గాని,నష్టపరిహారం గాని రాలేదని ఆ ప్రాంతంలో పర్యటించిన ప్రతినిధి బృందానికి తెలిపారు. మేయర్, కమిషనర్ ఈ ప్రాంతంలో పర్యటించి పేద వాళ్లకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ పర్యటనలో ఎన్. మద్దిలేటి,ప్రసాద్,దాదామియ ఉన్నారు



ఏడాది క్రితం కూల్చిన ఇల్లును పరిశీలిస్తున్న పట్టణ పౌర సంక్షేమయ సంఘం నాయకులు

ప్రపంచరంగస్థల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ కళాకారులు క్రిష్టఫర్ , చంద్రన్నలను సోమవారం రాత్రి కళాక్షేత్రంలో అధ్యక్షులు పత్తిఓబులయ్య ఘనంగా సత్కరించారు. కళారంగంలో వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నటులు జానకి రామయ్య, విశ్వసాహితీ కళాసంస్థ అధ్యక్షులు గాండ్లలక్ష్మన్న కళావాహిని అధ్యక్షులు ఎం.మనోహరబాబు కళా క్షేత్రం సభ్యులు లక్ష్మీకాంతరావు బాలవెంకటేశ్వర్లు ఇనాయతుల్లా, పిపి. గురుమూర్తి, సివి. రెడ్డి, చంద్రకంటి మద్దయ్య, శ్రీనివాసరెడ్డి, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.



రంగస్థల నటులకు సన్మానం చేస్తున్న పత్తిఓబులయ్య తదితరులు



జర్నలిస్టులకు టోపీలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

వేసవిలో జర్నలిస్టులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ ఏడాది వేసవి భగభగ మండే ఎండలు రానున్నాయని జర్నలిస్టులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ సీనియర్ వైద్యులు శంకర్ శర్మ సూచించారు. సోమవారం జర్నలిస్టులకు డాక్టర్ శంకర్ శర్మ టోపీలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎండలో కవరేజీకి వెళ్లినప్పుడు తలకు, ముఖానికి నేరుగా ఎండవేడిమి తగలకుండా చూసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా తరుచూ నీళ్లు, పలచని మజ్జిగ, ఒఆర్ఎస్ ద్రావణం లాంటివి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫోటో వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, ఎపిడబ్ల్యుజె జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, మల్లికార్జున, సత్తార్, శ్రీనివాసులు మధుసూదన్ రెడ్డి, రాజు, శివయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.



వైఎస్ ఆసరా చెక్కును అందజేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

మహిళా పక్షపాతి సిఎం జగన్ : కాటసాని

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ చెక్కును సోమవారం పంపిణీ చేశారు. అనంతరం సిఎం జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆసరా పథకం అక్క చెల్లెమ్మలకు జగనన్న వరాల జల్లు అని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నవరత్నాలలో భాగంగా మన అక్క చెల్లెమ్మల పొదుపు సంఘాల బ్యాంక్ రుణాల మొత్తం సొమ్మును 4 దఫాలుగా నేరుగా మన సంఘం పొదుపు ఖాతా ద్వారా అందిస్తారన్నారు. ఈ పథకం ద్వారా కల్లూరు మండలంలో 831 సంఘాలకు గాను 8621 మంది లబ్ధిదారులకు 4 కోట్ల 94లక్షల 25 వేలు లబ్ధి చేకూరుతుందన్నారు. పథక సంచాలకుల వెంకటసుబ్బయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకమ్మ, కల్లూరు మండల జడ్‌పిటిసి ప్రభాకర్ రెడ్డి, ఎంపిడిఒ రమణమూర్తి ఎపిఎం శ్రీనివాస్ గౌడ్, కల్లూరు సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర్ రెడ్డి, ఎంపిపి శారద పాల్గొన్నారు.

పోలకల్‌లో కొర్ర పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని పోలకల్‌లో ఉలిగి సువర్ణ భరత్ కుమార్, రాముడు లకు చెందిన పొలాల్లో ఎఒ మల్లేష్ కుమార్ సోమవారం కొర్ర పంట కోత ప్రయోగం చేశారు. నిర్ణీత కొలతల ప్రకారం ఎకరాకు 8 నుండి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు.ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ ఆదినారాయణ, సిబ్బంది వెంకటేష్,తిక్కన్న,జయన్న రైతులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని


వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కారం పట్ల అధికారులు నిర్లక్ష్యం చూపొద్దని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో ఆయా ప్రాంతాల ప్రజలు, రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఎలోకి వెళ్లకుండా చూడాలని తెలిపారు. పరిపాలన అధికారి గోవింద్ సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, మున్సిపల్ మేనేజర్ విజయ్ భాస్కర్ రెడ్డి, సీనియర్ సహాయకులు రామయ్య పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం

- సమగ్ర శిక్ష అభియాన్ జిసిడిఒ సునీత

ప్రజాశక్తి - హోళగుంద


విద్యార్థులకు బోధిస్తున్న జిసిడిఒ సునీత

విద్యార్థులు చిన్న వయస్సు నుంచే విద్యతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ జిసిడిఒ సునీత సూచించారు. సోమవారం స్థానిక సీజనల్ హాస్టళ్లను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి సైన్స్ సబ్జెక్టులో విద్యార్థుల ప్రతిభను గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇవే తెలివితేటలను భవిష్యత్తులో కొనసాగించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థి దశ చాలా గొప్పదని, ఇప్పుడే మన అడుగులు మంచి ఆలోచనలు కూడుకొని ఉండాలని తెలిపారు. అనంతరం రోజూ మెనూ ప్రకారం భోజనాలు అందుతున్నాయని లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. వంటశాలలో విద్యార్థుల కోసం తయారు చేసి పెట్టిన రాత్రి భోజనం అన్నం, పప్పు, రసం, మజ్జిగను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అసిస్టెంట్ జిసిడిఒ వేదమణి, ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఫౌండర్ ప్రెసిడెంట్ సిహెచ్.నాగరాజు, ఉపాధ్యాయులు, సీజనల్ హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పశు పోషణతో అభివృద్ధి

- ఎడిఎ మోహన్ విజయ్ కుమార్


ఆవులను పరిశీలిస్తున్న ఎడిఎ, ఎఒ

ప్రజాశక్తి - దేవనకొండ

జాతీయ వర్షాధార పథకం కింద మంజూరు చేసిన ఆవుల యూనిట్లతో పాడి పశుపోషణ ద్వారా రైతులు అభివృద్ధి చెందాలని పత్తికొండ ఎడిఎ మోహన్ విజయ్ కుమార్, ఎఒ సురేష్ బాబు తెలిపారు. సోమవారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామాన్ని వారు సందర్శించారు. జాతీయ వర్షాధార పథకం కింద పంపిణీ చేసిన 7 యూనిట్ల ఆవులను తనిఖీ చేశారు. మండల పశు వైద్యాధికారి అనిలా, ఎఇఒలు యోగేంద్ర, జయరాం, విహెచ్ఎ శివలింగ, రైతులు యోగి నాయుడు, లింగన్న, లింగడు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాల్లో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూ...దొందే...

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అలంభించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూ... దొందే అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు విమర్శించారు. సోమవారం స్థానిక ప్రయివేట్ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ కార్మికులను కార్పొరేట్లకు కట్టు బానిసలుగా మారుస్తున్నారని విమర్శించారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలను రూపొందిస్తూ వారు మరింత కోటీశ్వరులు కావడానికి అనుకూలమైన చట్టాలను రూపొందించారని తెలిపారు. డీజిల్, పెట్రోలు ధరలను పెంచుతూ ప్రజలపై భారాలు మోపారని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. వ్యవసాయ కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, 60 ఏళ్లు దాటిన వ్యవసాయ కూలీలకు పింఛను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు సంవత్సరంలో 200 రోజులు కల్పించాలని కోరారు. 2021 సంవత్సరం నాటికి దేశంలో 1,62,033 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతులే కాకుండా రోజువారీ కూలీలు కూడా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది 34 వేల మంది రోజువారీ కూలీలు ఆత్మహత్య చేసుకోగా నేడు అది 42 వేలకు పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధనవంతుడు మరింత ధనవంతుడుగాను, పేదవాడు మరింత పేదవానిగా మారే విధానాలను ప్రభుత్వాలు అవలంభిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టడానికి కార్మికులు, కర్షకులు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. 'చలో ఢిల్లీ' కార్యక్రమంపై మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించాలని కోరారు. సిఐటియు నాయకులు ప్రాణేష్, కెవిపిఎస్ మండల అధ్యక్షులు అనిల్, సిఐటియు మండల నాయకులు సురేష్, మారెప్ప పాల్గొన్నారు.


ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ప్రదీప్‌రెడ్డి

భూసర్వే విజయవంతం

- డిప్యూటీ తహశీల్దార్ మహేష్

- వైఎస్ఆర్ ఆసరా, భూ హక్కు పత్రాలూ పంపిణీ

ప్రజాశక్తి-పెద్దకడబూరు

మండలంలోని వివిధ గ్రామాల్లో భూసర్వేను విజయవంతంగా పూర్తి చేశామని డిప్యూటీ తహశీల్దార్ మహేష్ తెలిపారు. సోమవారం పెద్దకడబూరు ఐకెపి కార్యాలయ ఆవరణంలో ఐకెపి ఎపిఎం మహేష్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఆసరా పథకం కింద మూడో విడత మెగా చెక్కును పంపిణీ చేశారు. వైసిపి యువజన రాష్ట్ర నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి మహిళలకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ మహేష్ భూ సర్వేకు సంబంధించిన భూ హక్కుపత్రాలను ప్రతి రైతుకూ అందజేశారు. వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పురుషోత్తమ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిపి శ్రీవిద్య, జడ్‌పిటిసి రాజేశ్వరి, ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు ఛైర్మన్ భాగ్యమ్మ పాల్గొన్నారు.

నేడు పంచాయతీ వేలం పాటలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మేజర్ పంచాయతీకి మంగళవారం వేలంపాటలు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రంగనాయకులు, జూనియర్ సహాయకులు సతీష్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ వేలంపాటలకు ఆదోని డిఎల్‌పిఒ నూర్జహాన్ కూడా హాజరుకానున్నారని తెలిపారు. సంత మార్కెట్, బండిమెట్ట కమేలాలకు వేలంపాటలు నిర్వహించనున్నామని చెప్పారు. వేలంపాటలో పాల్గొనే వారు పంచాయతీకి ముందుగానే రూ.15 వేల ధరావతు చెల్లించాలని కోరారు.

కూరగాయల మార్కెట్‌ను యథావిధిగా కొనసాగించాలి

- కమీషన్ ఏజెంట్లు

ప్రజాశక్తి - ఆదోని

ప్రస్తుతం కాటన్ మార్కెట్‌లో కొనసాగుతున్న ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల వేలం మార్కెట్‌ను యథావిధిగా అక్కడే కొనసాగించాలని కమీషన్ ఏజెంట్లు ప్రకాష్ చంద్ర, నరసింహులు, న్యాయవాది శ్రీధర్, సింగ్, రాజు, నరసింహులు, హనీఫ్, లతీఫ్ కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అన్ని విధాలుగా అనుకూల పరిస్థితిలో కొనసాగుతున్న మార్కెట్‌ను మరో చోటికి మార్చే ఆలోచనను తెరపైకి తీసుకు రావడం తగదన్నారు. ఇక్కడ అన్ని రకాల మార్కెట్ వేలానికి అనుకూలతలు ఉన్నాయని, రైతులకు కూడా ఇక్కడ ఎంతో అనుకూలత ఉందని తెలిపారు. మరో చోటికి మారిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. విషయంపై అధికారులు పునరాలోచించి ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌ను వేరే చోటికి మార్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. లేకపోతే కూరగాయల మార్కెట్ ఏజెన్సీలు, రైతుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి ప్రేమ్ కుమార్

రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

- సర్పంచి ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి - చిప్పగిరి

శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని నేమకల్లు గ్రామంలో రాష్ట్రస్థాయి ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచి ప్రేమ్ కుమార్, గ్రామ నిర్వాహకులు, పెద్దలు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. 31న రథోత్సవం ఉంటుందని, ఏప్రిల్ 1న రాతిదూలం లాగుడు పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని చెప్పారు. ప్రథమ బహుమతి వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ రూ.30 వేలు, రెండో బహుమతి డేగలపాడు ప్రకాష్ రెడ్డి రూ.25 వేలు, మూడో బహుమతి ఎంపిపి భర్త, వైసిపి యువ నాయకులు జూటూరు మారయ్య రూ.20 వేలు, నాలుగో బహుమతి చిప్పగిరి బంగారు షాపు సత్తన్న దేవక్క గారి ప్రతాప్ రూ.15 వేలు అందజేస్తారని తెలిపారు. తర్వాత బహుమతులను నగరడోనా నాగేంద్ర, నేమకల్లు సచివాలయ కన్వీనర్ గిరి, లక్ష్మీకాంత్ రెడ్డి, చాకలి ప్రభాకర్ అందజేయనున్నట్లు చెప్పారు. అన్నదానానికి దేవక్క గారి జయన్న, మేకల లక్ష్మణస్వామి, డాక్టర్ వీరాంజనేయులు ముందుకొచ్చారని తెలిపారు. ఇతర వివరాలకు 7799522840, 8179297147 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మరుగుదొడ్లు, బోరు ఏర్పాటు చేయాలి

- కమిషనర్‌కు ఎంఆర్‌పిఎస్ వినతి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని అరుణ్‌జ్యోతి నగర్‌లో పబ్లిక్ మరుగుదొడ్లు, బోరు వాటర్ ఏర్పాటు చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. సోమవారం ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల ఇన్‌ఛార్జీ బండారి గిడ్డయ్య మాదిగ, పట్టణ ఇన్‌ఛార్జీ గుమ్మల బాలస్వామి మాదిగ మాట్లాడారు. బహిర్భూమికి వెళ్లే భూమికి ప్రహరీ నిర్మించడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. భూమిని స్వాధీనం చేసుకొని అంబేద్కర్, జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాలు, పబ్లిక్ పార్కు, పబ్లిక్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి కాలం కారణంగా నీటి సమస్య తలెత్తకుండా బోర్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఎంఎస్‌పి మండల ఇన్‌ఛార్జీ పిఎస్.వీరేష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు టి.ఈరన్న, దిబ్బనకల్ హుసేని, జిఎస్‌టి.అంజనప్ప పాల్గొన్నారు.

ఢిల్లీలో పోరాట ప్రదర్శనకు తరలిరండి

- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఏప్రిల్ 5న కార్మిక, కర్షక ఢిల్లీ పోరాట ప్రదర్శనకు అధిక సంఖ్యలో తరలి రావాలని సిఐటియు జిల్లా నాయకులు ఈరన్న, పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మన్న కోరారు. సోమవారం పట్టణంలో తిక్కస్వామి దర్గా, ఎల్‌బి స్ట్రీట్, రైస్ స్టాక్ పాయింట్ ప్రాంతాల్లో 'చలో ఢిల్లీ' ప్రచార కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, కనీస పింఛను రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం, కార్మిక, కర్షక హక్కుల కోసం ఏప్రిల్ 5న చేపట్టే 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. **హోళగుంద** బస్టాండ్‌లోని నాగప్పకట్ట దగ్గర 'చలో ఢిల్లీ' గోడపత్రికలు విడుదల చేశారు. సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, సిఐటియు మండల కార్యదర్శి నాగరాజ్ మాట్లాడారు. రైతు సంఘం మండల అధ్యక్షులు రవికుమార్, సూరన్న, ఈసా, రామాంజనేయులు పాల్గొన్నారు.


ఆదోనిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు


హోళగుందలో గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు



మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - మంత్రాలయం



నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. ఫిబ్రవరిలో జరిగిన స్కాలర్‌షిప్ పరీక్షల్లో 4 వేల మంది హాజరు కాగా అందులో 269 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. వారిలో తమ పాఠశాలకు చెందిన ఎస్.భానుమతి 119, వై.వైష్ణవి 102, ఎం.కీర్తి 97, కె.భార్గవి 95, ఎస్.సుధీర్ 85 మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పాఠశాలలో రోజూ 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు తీసుకొని శిక్షణ ఇవ్వడంతో ఉపాధ్యాయులు ఉరుకుందు, ప్రసన్న కుమారి కృషి ఎంతో ఉందన్నారు. విద్యార్థులు సాధించిన విజయంలో సహకరించిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

వాల్మీకులందరినీ ప్రాంతాలకతీతంగా

ఎస్టీ జాబితాలో చేర్చాలి

- వాల్మీకి వనభోజన సమితి నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వాల్మీకులపై నిజమైన ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే ప్రాంతాలకు అతీతంగా 8 జిల్లాల్లోని వాల్మీకులందరినీ ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి వనభోజన సమితి నాయకులు కోరారు. సోమవారం వాల్మీకి వనభోజన సమితి నాయకులు బంగారు వెంకటేష్, విజిఆర్.కొండయ్య, పుండుకూర రంగన్న, మధుబాబు నాయుడు, యాపిలయ్యలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించి రాష్ట్రంలోని వాల్మీకులందరినీ ఎస్టీలుగా గుర్తించాలని కోరారు. గత దశాబ్దాలుగా చేస్తున్న పోరాటాలను అవమానపరుస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాయలసీమలో గల నాలుగు జిల్లాల్లోని వాల్మీకులను మాత్రమే చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం దారుణమని చెప్పారు. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతాల్లో వాల్మీకులు ఎస్టీలుగా ఉన్నారని చెబుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఉన్న వాల్మీకులను విస్మరించారని అన్నారు. అధికార పార్టీలో గల వాల్మీకి నాయకులందరూ ప్రధాన బాధ్యతగా తీసుకొని ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. ప్రాంతాలకతీతంగా వాల్మీకులందరినీ ఎస్టీ జాబితాలో చేరుస్తూ శాసనసభలో చేసిన తీర్మానాన్ని సవరించేలా చేసి కేంద్రానికి పంపేలా చూడాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని వాల్మీకులందరి ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎల్ఐసి హరినాథ్, రాజకుమార్ నాయుడు, ఎల్లం బీడీ లక్ష్మన్న, నాగేష్, బిటి.లక్ష్మన్న, వీరేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వాల్మీకి వనభోజన సమితి నాయకులు


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

'ఉపాధి' పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలో ఉపాధి హామీ కూలీలకు సుమారు 8 వారాలుగా వేతనాలు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టారని, తక్షణమే వాటిని చెల్లించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పాండవగల్లు గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలిసి ఆయన మాట్లాడారు. గతంలోని 10 వారాలు చేసిన పనులకు రెండు వారాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం 15 రోజులకోసారి వేతనాలు చెల్లించాల్సి ఉన్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో వ్యవసాయ కూలీలతో పోరాట ప్రదర్శన చేపడుతున్నట్లు తెలిపారు. కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'పది'లో ఉత్తీర్ణత సాధించాలి

- లాయర్ షేక్షావలీ, విశ్రాంత ఎంఇఒ కబీర్

- ప్రజ్ఞ వికాసం పదో తరగతి మోడల్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రతి విద్యార్థీ భవిష్యత్తులో ఏదైనా సాధించాలన్నా పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, ఉన్నత చదువుల్లో మంచి అవకాశాలు వస్తాయని లాయర్ షేక్షావలీ, విశ్రాంత ఎంఇఒ కబీర్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రజ్ఞ వికాసం' పదో తరగతి మోడల్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన మండలంలోని నేమకల్లు ఉన్నత పాఠశాల, చిప్పగిరిలోని కెజిబివి, చిప్పగిరి హై స్కూల్ విద్యార్థులకు సోమవారం లాయర్ షేక్షావలీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా లాయర్ షేక్షావలీ, కబీర్, కెజిబివి ప్రిన్సిపల్ షబీనా మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలపై అవగాహన కోసం, పబ్లిక్ పరీక్షల పట్ల భయాందోళన చెందకుండా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువుపై శ్రద్ధ వహించి మంచి మార్కులు సాధించాలని చెప్పారు. పరీక్షలు రాసేటప్పుడు ఏమాత్రం భయం వద్దన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మైనా, రవీంద్ర, ధనుంజయ్, నేమకల్లు ప్రధానోపాధ్యాయులు అబ్రహాం లింకన్, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న లాయర్ షేక్షావలీ

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

'పది' విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ

ప్రజాశక్తి - హోళగుంద


విద్యార్థులకు పంపిణీ చేస్తున్న నాయకులు


మండలంలోని ఇంగలదహల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్షలు ప్యాడ్స్ పంపిణీ చేశారు. సోమవారం సరస్వతి పూజ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున, పరమేష్ ఆధ్వర్యంలో పరీక్షల ప్యాడ్స్‌ను ఉపాధ్యాయుల చేతులమీదుగా అందజేశారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా రాయాలని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంత్యుత్సవాలను

ప్రభుత్వమే నిర్వహించాలి

- ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆదోని



వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జయంత్యుత్సవాలను అధికార లాంఛనాలతో ప్రభుత్వమే నిర్వహించాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు దైవ ప్రసాద్, సాయిరాం, అడ్వకేట్ చంద్రయ్య మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనివార్య కారణాల వల్ల గతేడాది నిర్వహించలేదన్నారు. కార్యక్రమ నిర్వహణకు చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హామీ ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు. నాయకులు గంగాధర్, పరిగెల నారాయణ, లాలప్ప, కుశల రాజు ఉన్నారు.

సామూహిక వివాహాల

ప్రచార ఫ్లెక్సీలు విడుదల

ప్రజాశక్తి - ఆదోని

ఏప్రిల్ 23న దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక వివాహాలకు సంబంధించిన ప్రచార ఫ్లెక్సీలను సోమవారం ఎఐవైఎఫ్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా డిహెచ్‌పిఎస్ జిల్లా సహాయ కారదర్శి టి.వీరేష్ మాట్లాడారు. మానవతవాదులైన బాబు జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిబా ఫూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్, శ్రీబసవేశ్వర స్వామి జయంతుల సందర్భంగా సామూహిక వివాహాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సామూహిక వివాహాలంటే కేవలం నిరుపేదలు మాత్రమే చేసుకునే వివాహాలు అనే అపోహ చాలా మందిలో ఉందని చెప్పారు. ఇదొక పవిత్ర కార్యమని, గుర్తించి త్వరలో పెళ్లి చేసుకోబోయే జంటలు సామూహిక వివాహం చేసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. జిల్లా సమితి సభ్యులు ఎ.విజయ్, మండల అధ్యక్షులు నరసప్ప, పట్టణ కార్యదర్శి ఆర్.భాస్కర్, నాయకులు బంగారప్ప, పులి రాజు, వీరేష్ పాల్గొన్నారు.

ఐఇడి బాంబు పేలి జవాన్ మృతి

ప్రజాశక్తి-చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా



విజయ్ (ఫైల్)

మావోయిస్టులు అమర్చిన ఐఇడి ప్రెషర్ బాంబ్ పేలి జవాన్ మృతి చెందిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎటపల్లి పోలీస్ క్యాంపునకు ఒక కిలోమీటర్ దూరంలో తొకరీ సమీపంలో బాంబు శబ్దం రావటంతో జవాన్లు అటువైపుగా పరుగులు తీశారు. బాంబు పేలిన స్థలంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాజ్పూర్ గ్రామానికి చెందిన సిఎఎఫ్ అసిస్టెంట్ ఫ్లయింగ్ కమాండర్ విజయ్ మృతి చెంది ఉన్నారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

నళిని చిదంబరం పిటిషన్‌కు కవిత పిటిషన్ ట్యాగ్

- 3 వారాల పాటు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహిళలను ఇడి కార్యాలయానికి పిలిచి విచారణ జరిపే విషయంలో కేంద్ర మాజీ మంత్రి పి చిదంబరం భార్య నళిని చిదంబరం 2018లో దాఖలు చేసిన పిటిషన్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం ట్యాగ్ చేసింది. అనంతరం మూడు వారాలపాటు విచారణను వాయిదా వేసింది. ఒక మహిళగా తనకు ఉన్న హక్కులను ఇడి కాలరాస్తోందంటూ సుప్రీంకోర్టులో కె కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. కవిత తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు.

రూ.33 వేల కోట్లతో మౌలిక వసతులు

- గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ దొరబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిర్మాణాల్లో ఉన్న జగనన్న కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ.33 వేలకోట్లను వ్యయం చేస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. విజయవాడలోని గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఛైర్మన్ దొరబాబు అధ్యక్షతన గృహ నిర్మాణ సంస్థ 31వ బోర్డు సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. కాలనీల్లో రహదారుల నిర్మాణానికి రూ.10,408 కోట్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు రూ.5,237 కోట్లు, భూగర్భ డ్రెయినేజీకి రూ.798 కోట్లు, మంచినీటి సరఫరాకు రూ.2,980 కోట్లు, విద్యుత్ సరఫరాకు రూ.4,560 కోట్లు, ఇంటర్నెట్ సదుపాయానికి రూ.707.48 కోట్లు, రెండోదశ పనులకు రూ.7,809 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ఇప్పటి వరకు విద్యుదీకరణ పనులు 3,485 కాలనీల్లో పూర్తి కాగా, మరో 5,363 లే అవుట్లలో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. 2,37,701 మంది లబ్ధిదారుల ఇళ్లకు విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేశామని దొరబాబు పేర్కొన్నారు.



గృహ నిర్మాణ సంస్థ 31వ బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ ఛైర్మన్ దొరబాబు

జల్‌జీవన్ పథకం కింద మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. 2,31,966 మంది లబ్ధిదారులకు మంచినీటి సౌకర్యం ఇంతవరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,127 స్వాగత ద్వారాలు ఏర్పాటుచేశామన్నారు. కాలనీల్లో తాత్కాలికంగా మౌలిక సదుపాయాల కోసం రూ.1,650 కోట్లను ప్రభుత్వం ఖర్చు పెడుతోందన్నారు. గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డి లక్ష్మీషా మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. రాష్ట్రంలో 18.63 లక్షల ఇళ్ల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని, 2024 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. బోర్డు సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టరు ఎం శివప్రసాద్, చీఫ్ ఇంజినీరు జివి ప్రసాద్, గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

సందర్శకుల కోసం పది విద్యుత్ ధర్మరథాలు

- ప్రారంభించిన టిటిడి ఛైర్మన్
- విరాళంగా అందించిన మేఘా సంస్థ

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో సందర్శకులను ఉచితంగా రవాణా చేసేందుకు పది నూతన విద్యుత్ ధర్మరథాలను టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి సోమవారం ప్రారంభించారు.

ఒలెక్ట్రా సంస్థకు చెందిన రూ.18 కోట్లు విలువైన ఈ విద్యుత్ బస్సులను హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థ టిటిడికి విరాళంగా అందజేసింది. తిరుమలలోని రాంభగీచా విశ్రాంతి గృహాల వద్ద ధర్మరథాలను ఛైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలలో పర్యావరణ పరిరక్షణ కోసం వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి డీజిల్ వాహనాల స్థానంలో దశలవారీగా విద్యుత్ వాహనాలు ప్రవేశపెట్టాలని టిటిడి బోర్డు నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా మొదటిదశలో తిరుమలలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు 35 విద్యుత్ కార్లు ఇచ్చామని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తిరుమల-తిరుపతి మధ్య ఎపిఎస్ఆర్‌టిసి 65 విద్యుత్ బస్సులు నడుపుతోందని అన్నారు. ఏప్రిల్ 15 నుంచి భక్తులకు ఈ బస్సులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒలెక్ట్రా సంస్థ సిఎండి కెవి.ప్రదీప్, టిటిడి చీఫ్ ఇంజినీర్ శ్రీనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు సేవలందించడానికి సిద్ధంగా ఉన్న బస్సులు



సిపిఐ నిరసన దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు జగన్నాథం

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించవద్దు

సిపిఐ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : పోలవరం ప్రాజెక్టు తొలిదశ నిర్మాణం 41.15 మీటర్ల ఎత్తు వరకేనంటూ కేంద్ర జల శక్తి వనరుల శాఖ సహాయ మంత్రి ప్రహ్లాద సింగ్ పటేల్ పార్లమెంటులో ప్రకటనను నిరసిస్తూ సోమవారం దీక్షలను కర్నూలు నగరంలోని ధర్నా చౌక్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవుల శేఖర్, ఎన్ లెనిన్ బాబులు సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పై వివక్ష చూపుతుందన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు తొలి దేశ పేరుతో 45.72 మీటర్ల ఎత్తు నుండి 41.15 మీటర్ల ఎత్తుకు తగ్గించడంతో జాతీయ ప్రాజెక్టు పోలవరం మినీ ప్రాజెక్టుగా మారుతుందన్నారు. దీనివల్ల నేటి నిల్వ 196.60 టిఎంసిలు ఉండే నీటి సామర్థ్యం 92 టిఎంసిలకే పరిమితమవుతుందన్నారు. పూర్తిస్థాయి ప్రాజెక్టు నిర్మాణం జరిగితే 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, 960 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి జరుగుతుందని, 80 టిఎంసిల నీటిని గోదావరి నుండి కృష్ణ నదికి తరలించడం, కృష్ణ నీటిని శ్రీశైలం ద్వారా కృష్ణ డెల్టాకు ఇచ్చే నీటిని ఆదా చేసి వాటిని రాయలసీమకు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. రాయలసీమ ప్రాజెక్టులైన గాలేరు నగరి హంద్రీనీవా లాంటి ప్రాజెక్టులకు కొంత మేరకు నికర జలాలు కేటాయించవచ్చన్నారు. కుడి ఎడమల కాలువల ద్వారా 534 గ్రామాలకు త్రాగునీరు విశాఖపట్నంకు 24 టిఎంసిల నీటిని అందించి విశాఖ నగర ప్రజల దాహార్తిని తీర్చమని వారు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో పెండింగులో ఉన్న వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టుల పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే నిధులు విడుదల చేసి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.

అగ్రసేని బిల్డరును కాపాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కల్లూరు మండలంలో హంద్రీ నది సమీపంలో సర్వే నంబర్470/బి లో అక్రమంగా నది పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడితే బిల్డర్ పై చర్యలు తీసుకోవాలని రాయలసీమ యువజన నాయకులు రామిరెడ్డి అశోకులు డిమాండ్ చేశారు. కొంతమంది రెవెన్యూ అధికారులు ఆయనను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్ ను కలిసి వారు వినతి పత్రాన్ని సమర్పించారు. అగ్రసేని రియల్టర్ కల్లూరు మండలం కల్లూరు రెవెన్యూలో సర్వేనెంబర్. 470/%దీ% హంద్రీనదిని ఆక్రమించి ఇండ్లు నిర్మాణం . హంద్రీనదిలో ఇంటి నిర్మాణం అప్రువల్స్ ఇవ్వడం మునిసిపల్ వారి అక్రమాలు ఏ విధంగా ఉన్నాయే అర్థం చేసుకోవాలన్నారు, అదేవిధంగా రెవెన్యూవారు సర్వేనెంబర్ 767 -2 లో అగ్రసేని వారికి ఎటువంటి ఆధార పత్రాలు లేకపోయినా 0.45 సెంట్లు భూమి ఉన్నట్లు అడంగల్ లో నమోదు చేసారన్నారు. రిజిస్ట్రేషన్ వారు అయితే సర్వేనెంబర్ 767/3%ూ%1 లో భూమి హక్కుగా ఉన్నది 0.72 సెంట్లు అయితే 1 ఎకరా 9 సెంట్లకు రిజిస్ట్రేషన్ చేసారన్నారు. అదేవిధంగా రోడ్డు కోసం దేవాలయ భూమిని ఆక్రమించడం జరిగింది అన్నారు దీనిపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి రాజీనామా చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తిరుమల తిరుపతి దేవస్థానం(టిడిపి) ఉద్యోగి వద్ద ఇటీవల గంజాయి పట్టుబడిందని దీనికి నైతిక బాధ్యత వహిస్తూ టిటిడి ఛైర్మన్ వై.వి సుబ్బారెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని కర్నూలు టిడిపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిటిడి సన్నిధిలో గంజాయి దొరకడం కంటే దౌర్భాగ్యమైన చర్య ఇంకోటి ఉండదని ఆయన తెలిపారు. ఈ ఘటనకు ఎవరు కారకులో ఎంక్వయిరీ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపతి వెంకటేశ్వర స్వామితో పెట్టుకుంటే వైసిపి కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గార్గేయపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు సోఫి, ఈ తాండ్రపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రకాష్, వెంకట రాముడు, సత్యాలు, హనుమంతు, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల క్షేత్రానికి ఇంద్ర ఎసిబస్సు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

భక్తుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, కర్నూలు-2 డిపో తమిళనాడు రాష్ట్రం లోని అరుణాచల క్షేత్రాన్ని దర్శించుకొనుటకు, గిరి ప్రదక్షిణకు దీపోత్సవానికి ఏప్రిల్ 4న న కర్నూలు నుండి ఇంద్ర ఎసి బస్సును నడుపుతున్నట్లు 2 డిపో మేనేజర్ సర్దార్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 4న మంగళవారం రాత్రి 08.00 గంటలకు బస్సు బయలుదేరి, అరుణాచలంకు 5న న ఉదయం 05.00 గంటలకు చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర స్వామి దర్శనం తర్వాత, అదే రోజు సాయంత్రం 04.00 గంటలకు బయలుదేరి, 6న 06.00 గంటలకు కర్నూలుకు చేరుకొనును. ఈ అరుణాచల క్షేత్ర దర్శనమునకు రాను, పోను రూ.2500 ఛార్జిగా నిర్ణయించామన్నారు.

ఈ సర్వీసుకు (సర్వీసు నెం.93998) అడ్వాన్సు రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. ఆన్ లైన్ లో కాని, బస్టాండులో కాని, అధీకత ఏజెంట్ల వద్ద కాని రిజర్వేషన్ చేయించుకొని మీకు నచ్చిన సీట్లు పొందవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) ... 7382871131 డిపో మేనేజరు, 99592 25794 సంప్రదించవచ్చన్నారు.

కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి

ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : విధి నిర్వహణలో చనిపోయిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు వెంటనే కారుణ్య నియామకాలను చేపట్టాలని ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ గిరి కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు నగరంలోని విధి నిర్వహణలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలను ఎపిజెఎసి అమ రావతి ప్రతినిధి బృందం కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ఎపిజెఎసి అమరావతి తరపున భరోసా కల్పిస్తూ వారి పక్షాన పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఛైర్మన్ గిరి కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు కూడా ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ఆ ఉద్యోగుల కుటుంబాలు ఉపాధి లేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉండాల్సిన ప్రభుత్వం ఇప్పటివరకు కారుణ్య నియామకాలను చేపట్టకపోవడం బాధాకరమన్నారు. వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని లేకపోతే ఉద్యోగస్తుల కుటుంబాలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ బృందంలో అసోసియేట్ ఛైర్మన్ నాగారమణయ్య, రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, జెఎసి సెక్రటరీ జనరల్ కెవై .కష్ణ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, వై.నాగేశ్వర రావు నాయకులు శంకర్ నాయక్ , రామానాయుడు, శోభా సువర్ణమ్మ అప్పరాజు లోకేశ్వరి గ్రామవార్డు సచి వాలయ ప్రతాప్ ప్రశాంత్ రాముడు రామాంజ నేయులు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిలేటి పాల్గొన్నారు.

అగ్రసేని బిల్డర్ను కాపాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కల్లూరు మండలంలో హంద్రీ నది సమీపంలో సర్వే నంబర్470/బి లో అక్రమంగా నది పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడితే బిల్డర్ పై చర్యలు తీసుకోవాలని రాయలసీమ యువజన నాయకులు రామిరెడ్డి అశోకులు డిమాండ్ చేశారు. కొంతమంది రెవెన్యూ అధికారులు ఆయనను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్ ను కలిసి వారు వినతి పత్రాన్ని సమర్పించారు. అగ్రసేని రియల్టర్ కల్లూరు మండలం కల్లూరు రెవెన్యూలో సర్వేనెంబర్. 470/%దీ% హంద్రీనదిని ఆక్రమించి ఇండ్లు నిర్మాణం . హంద్రీనదిలో ఇంటి నిర్మాణం అప్రువల్స్ ఇవ్వడం మునిసిపల్ వారి అక్రమాలు ఏ విధంగా ఉన్నాయే అర్థం చేసుకోవాలన్నారు, అదేవిధంగా రెవెన్యూవారు సర్వేనెంబర్ 767 -2 లో అగ్రసేని వారికి ఎటువంటి ఆధార పత్రాలు లేకపోయినా 0.45 సెంట్లు భూమి ఉన్నట్లు అడంగల్ లో నమోదు చేసారన్నారు. రిజిస్ట్రేషన్ వారు అయితే సర్వేనెంబర్ 767/3%ూ%1 లో భూమి హక్కుగా ఉన్నది 0.72 సెంట్లు అయితే 1 ఎకరా 9 సెంట్లకు రిజిస్ట్రేషన్ చేసారన్నారు. అదేవిధంగా రోడ్డు కోసం దేవాలయ భూమిని ఆక్రమించడం జరిగింది అన్నారు దీనిపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నవరసభరితం నాటకం

-నందిఅవార్డుగ్రహీత పత్తి ఓబులయ్య

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

కావ్యేషు నాటకం రమ్యమ్" అన్నది భారతీయ సాహిత్యంనుండి పుట్టిన అతి రమణీయమైన వాక్యమని కావ్యాలలో నాటకానికున్న ప్రాధాన్యత ప్రాచుర్యాన్నీ చెబుతుందని, జీవకళ, జీవితాన్ని ప్రతిబింబించే కళ మాత్రమే కాదు.సజీవంగా ప్రేక్షకుల ముందు ఆవిష్కరించే కళ నాటకమని నంది అవార్డుగ్రహీత ప్రముఖనాటక దర్శకులు పత్తిఓబులయ్య అన్నారు. ప్రపంచరంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని టిజివి కళాక్షేత్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ..అంతరించిపోతుందనే నాటకరంగానికి తమసంస్థ జీవం పోస్తున్నదన్నారు. ఇప్పటివరకు 31 నంది బహుమతులందుకున్న ఘనత టిజివి కళాక్షేత్రం కళాకారులకే దక్కుతుందన్నారు. ఎన్ని సార్లు ఆడిన నాటకమయినా,ఎంతటి గొప్ప సంస్థ కళాకారుడికైనా,ఎంతటి ప్రయోక్తకైనా,ప్రతి ప్రదర్శన ఓ అగ్ని పరీక్షేనని రంగస్థలానికి ముందు వుండే కళాకారులకి వెనక వుండే సాంకేతిక నిపుణులకు సమన్వయంతో ఆవిష్కరించే నిత్య సజీవకళ నాటకమన్నారు. అందుకే జీవితానికి దర్పణం నాటకం సమాజంలోని సమస్యలను ప్రతిబింబిస్తూ వారిలో చైతన్యాన్ని కలిగించే ప్రచార సాధనం నాటకమని సాహిత్య ప్రక్రియలలో నాటకరచన కష్టమైందన్నారు. క్లిష్టమయిందని రచయిత స్రష్ట అయితే నటుడు ఆ భావాన్ని వ్యక్తపరిచే వ్యాఖ్యాత అవుతాడన్నారు. నాటకం సర్వజనామోదకరమైనప్పుడు, అది రసానంద జనకమవుతుందన్నారు. నాటక ఇతివృత్తం సాంఘికమయినా, పౌరాణికమయినా, చారిత్రాత్మకమయినా, దాని అంతిమలక్ష్యం సమాజశ్రేయస్సేనని చెప్పకతప్పదన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక రూపాలలో నాటకాన్ని ప్రోత్సహించడం ప్రజలకు నాటకం ప్రాముఖ్యతపై అవగాహన కలిపించడం, విస్తృత స్థాయిలో నాటక సంస్థలకు ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులకు అవగాహన కలిపించి వారి ద్వారా నాటకరంగాన్ని అభివృద్ధి చేయడమన్నారు. మానసిక ఉల్లాసంకోసం నాటకాన్ని ఆస్వాదింపజేయడం తద్వారా నాటకరంగాన్ని బతికించడమే లక్ష్యంగా సాగుతున్నామన్నారు.



నలుదిశలా విస్తరిస్తున్న ఖ్యాతి

నాటకరంగాన్నే కాదు కళాకారులను కూడా టిజివి కళాక్షేత్రం బతికిస్తున్నదని..పేదకళాకారులకు అండగా నిలబడి వారికి జీవనోపాధిని చూపించి సహాయసహకారం అందిస్తున్నది. ఇటీవల శ్రీకృష్ణకమలపాలిక నాటకానికి జాతీయస్థాయి బహుమతులు రావడం గొప్పవిషయమని సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. ఆయనతోపాటు ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు ఎంపి బసవరాజు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు జెఎన్ శేషయ్య, జె.రంగస్వామిలు ఈ సందర్భంగా కలసి పత్తిఓబులయ్యను అభినందించారు.



వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి

ప్రజాశక్తి- కౌతాళం

వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం కురువ లింగన్న కు చెందిన గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఇందులో 17 గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. సుమారు లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందని బాధితుడు పేర్కొన్నాడు.

నారాయణ లో స్పెల్ బీ విజయవంతం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు నగరం మాధవ నగర్ లోని నారాయణ పాఠశాలలో స్పెల్ బీ నిర్వహించారు. కార్యక్రమానికి ఈ కిడ్స్ కో ఆర్డినేటర్ అరుణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కష్ట తరమైన ఆంగ్ల పదాలను సులభరీతిలో పొందుపరచడం జరిగిందన్నారు. పోటీల వల్ల ఆంగ్ల పదాలు అర్థంగా అంచనా వేస్తారన్నారు. విజేలతకు సీల్డ్, మెడల్స్, సర్టిఫికేట్ అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అల్తాఫ్ వైస్ ప్రిన్సిపాల్ రాధ, సాఫ్ట్ స్కిల్ నాగరాజు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ ప్రక్రియ

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

కర్నూలు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నామినేషన్లు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు జరిగాయి. అధ్యక్ష స్థానానికి బి. చంద్రుడు, టి.నాగభూషణం నాయుడు లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఉపాధ్యక్ష స్థానానికి సయ్యద్ షాబుద్దీన్, ఎం.నిత్య జీవన్ రాజు, ప్రధాన కార్యదర్శి స్థానానికి , ఎంవి. చక్రపాణి , బిఎస్. రవికాంత్ ప్రసాద్, కె. నాగరాజు జి. రమేష్, ఎం. వెంకటేశ్వర్లు, డి. నరసింహులు నామినేషన్లు దాఖలు చేశారు. సంయుక్త కార్యదర్శి స్థానానికి కె. అరుణ జ్యోతి, ఎస్.లక్ష్మన్న జి. రవికుమార్ కోశాధికారి స్థానానికి మొహమ్మద్ షఫత్ గ్రంథాలయ కార్యదర్శి స్థానానికి ఎస్. లక్ష్మన్న, బికె. నాగరాజు , వి. రవికుమార్ క్రీడలు , సాంస్కృతిక కార్యదర్శి స్థానానికి బి. రాకేష్ , మహిళా ప్రతినిధి స్థానానికి ఎ.అన్నపూర్ణా రెడ్డి, సి.జాష్మిన్ లు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళ వారం నామినేషన్ ఉపసంహరణ ఉంటుంది. అదే రోజు బరిలో ఉన్నఅభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారులు కె.రాజమోహన్ రెడ్డి తెలిపారు. సహాయ ఎన్నికల అధికారులు గా బాబు సాహెబ్, లోకేశ్వర రెడ్డి, ఆంజనేయులు, వరప్రసాద్ రావు లు వ్యవహరించారు. మార్చ్ 31 వ తేది ఉదయం 8.00 నుండి మధ్యాహ్నం 2.00 వరకు పోలింగ్ ,3.00 నుండి కౌంటింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు.

30న జీ డ్రామా జూనియర్స్ ఆడిషన్స్

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

జీ డ్రామా జూనియర్స్ సీజన్ 6 కోసం 30న కర్నూలులో ఆడిషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో నటనపై ఆసక్తిగల చిన్నారులతో పాటు సంగీతంపై మక్కువ ఉన్న వారికి ఇదే చక్కని అవకాశమని తెలిపారు. కర్నూలు రైల్వే స్టేషన్ కాంపౌండ్లోని హెరిటల్ ప్రైమ్ ల్యాండ్‌లో 30న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆడిషన్లు నిర్వహించనున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పిల్లల్లోని నటనా ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో విజయవంతంగా 5 సీజన్లను పూర్తి చేసుకున్న డ్రామా జూనియర్స్ ఆరో సీజన్ ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభించిందన్నారు. ప్రతిభగల గాయనీ గాయకులనూ ఆడిషను ఆహ్వానిస్తోందన్నారు. 3 నుంచి 13 సంవత్సరాల వయస్సు ఉండి నటనపై ఆసక్తి ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తరువాతి వారాల్లో విజయవాడ, రాజమహేంద్రవరం, తిరుపతి, విశాఖపట్నం, నెల్లూరు, ఖమ్మం, కరీంనగర్, హనుమకొండ నగరాల్లో కూడా ఆడిషన్లు నిర్వహించనున్నామన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే 9154984009 నెంబరుకు కాల్ చేయాలని కోరారు.

గుండ్రేవులలో నేటి నుండి బడేశా ఖాద్రి ఉత్సవాలు

ప్రజాశక్తి -సి బెళగల్

మండలంలోని గుండ్రేవులలో బడేశా ఖాద్రి ఉరుసు మహోత్సవాలు నేటి నుండి ప్రారంభం అవుతాయని దర్గా పెద్దలు సోమవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా దర్గా ముస్తాబుతో అలంకరించుకొందని నేడు గంధం, రేపు ఉరుసు, ఎల్లుండి కిస్తీ వంటి ఉత్సవాలు ఉంటాయని తెలిపారు.



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆవాజ్ నాయకులు

తాగునీరు,విద్యుత్ , పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని, మంచినీటి కొరత, విద్యుత్ కోత, లేకుండా నగరం మొత్తం పరిశుభ్రంగా ఉంచాలని ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో కమిషనర్ ఎ. భార్గవ్ తేజ కు వినతి పత్రం అందజేశారు.

ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రంగా రంజాన్ మాసాన్ని భావించి భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉంటూ అల్లాహ్ యొక్క దయ కోసం, పుణ్యం కోసం ముస్లిం సోదరులందరూ కూడా ఉపవాస దీక్షలు చేస్తారన్నారు. కర్నూలు నగరంలో మతసామరస్యానికి ప్రత్యేకంగా ప్రతీకంగా ఉంటూ కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా అన్ని రకాల పండుగలను సామరస్యాంగా జరుపుకునే సాంప్రదాయం ఉందన్నారు. కర్నూలు నగరంలో ఉండే ప్రజానీకనందరికి మరీ ముఖ్యంగా ముస్లిం సోదరులు ఎక్కువగా నివసించే ప్రాంతాలలో మంచినీటి సౌకర్యం కల్పించి, నిరంతరం మంచినీటి సరఫరా అయ్యే విధంగా, కొరత లేకుండా చూడాలన్నారు. అలాగే విద్యుత్ నిరంతరాయంగా కోత ఉండకుండా సరఫరా చేయాలని నగరం మొత్తం మసీదుల దగ్గర ముస్లింలు నివసించే ప్రాంతాలలో వీధులు, కాలువలు, రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆవాజ్ నగర కమిటీగా కోరామన్నారు.

చిరుధాన్యాల వాడకాన్ని ప్రోత్సహించండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

చిరు ధాన్యాలలో ఉన్నటువంటి పోషకాహార విలువలతో మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. చిరుధాన్యాల వాడకాన్ని ప్రోత్సహించాలని ఆయన కోరారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ఐసిడిఎస్ ఇంచార్జ్ పిడి ఉమామహేశ్వరి అధ్యక్షతన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన చిరు ధాన్యాల పోషకాహార వంటకాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చిరుధాన్యాల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. చిరు ధాన్యాలలో ఉన్నటువంటి పోషకాహార విలువలతో మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒలు, కోఆర్డినేటర్లు, అంగన్వాడి సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.



వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్



జిల్లాకు '104' వాహనాలు 5 మంజూరు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్


జెండా ఊపి 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంలో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అదనంగా 104 వాహనాలు కొత్తగా 5 మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైయస్ఆర్ సెంటినరీ హాలు ఆవరణలో కొత్త 104 వాహనాలను జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి, నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పారవి చంద్ర కిషోర్ రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 29 మండలాలకు 104 వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటికి అదనంగా మరో 5 కొత్త వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. మంజూరైన ఐదు వాహనాలను డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, నంద్యాలకు, ఒకటి రిజర్వులో వుంటుందన్నారు. పెద్ద మండలాల్లో వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఏర్పడటం వల్ల ప్రభుత్వం అదనంగా మరో 5 కొత్త వాహనాలు మంజూరు చేసిందన్నారు. ప్రతి 104 వాహనం ఒక సచివాలయాన్ని రెండుసార్లు సందర్శించి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఇందులో డాక్టర్, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, ఆశా, ఎంపిహెచ్ఏ, డిఇఒ అందుబాటులో ఉంటారన్నారు. ఒక మెడికల్ ఆఫీసర్ 104 విధులను నిర్వహిస్తే మరో మెడికల్ ఆఫీసర్ పిహెచ్‌సిలో సేవలు అందిస్తారన్నారు. ఉదయం వేళల్లో వచ్చిన ఏఎన్‌సి, పిఎన్‌సి, బీపీ, షుగర్, జనరల్ ఓపి చూస్తారని, మధ్యాహ్నం నుండి రాలేని వికలాంగులు, వృద్ధులు, మంచానికి పరిమితమైన వారిని పరీక్షించి మందులు ఇస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రభావతి, 104 జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి, 104 జిల్లా మేనేజర్ మొహమ్మద్ రఫీ, ఇఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం

ప్రజాశక్తి - నంద్యాల


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం

గ్రామాల్లో చెత్తాచెదారాన్ని సేకరించి ఊరి చివర వేసి, పరిశుభ్రతకు, ప్రజలకు అంటురోగాలు రాకుండా చూస్తూ నిత్యం సేవలు చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే పెండింగ్ వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, స్వచ్ఛభారత్ కార్మికుల సంఘం జిల్లా నాయకులు సుబ్బరాయుడు, నారాయణ త్యాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ రోజురోజుకు ధరలు పెరిగి నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే ఇచ్చే అతి తక్కువ వేతనాలు నెల నెల ఇవ్వకుండా అధికారులు పనులు మాత్రం చేయించుకోవడం దారుణమన్నారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సర్పంచుల చుట్టూ, జిల్లా అధికారుల చుట్టూ తిరిగినా ఏమాత్రం ఫలితం లేదన్నారు. వేతనాలు ఇవ్వమని అధికారులను అడిగితే పనులు చాలించు కోండి, వేరేవాళ్లను పెట్టుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. కొన్ని చోట్ల గ్రామ సర్పంచులు తమ గ్రాంటు నుండి వేతనాలు ఇవ్వబోమని, పనులు చాలించుకోండి అంటూ చెబుతున్నారని అన్నారు. మూడు సంవత్సరాల క్రితం 10 వేల జీతం ఇస్తామంటూ జీవో నెంబర్ 680 ఇచ్చినా నేటికీ అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలో పెద్ద పండుగలైన శివరాత్రి, ఉగాదికి వేతనాలు వస్తాయని ఎదురుచూసిన స్వచ్ఛభారత్ కార్మికులకు నిరాశే మిగిలిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, కార్మికులకు నెలలు తరబడి వేతనాలు పెండింగ్ పెట్టడంతో మానసికంగా కుంగిపోతున్నారని పేర్కొన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



రంజాన్ వేళలు

మంగళవారం
ఇఫ్తార్ : 6 : 35

బుధవారం
సహెరి : 4 : 53

హోంగార్డు కుటుంబాలకు ఆర్థికసాయం



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని డోన్, నంద్యాల యూనిట్‌లో హోంగార్డ్‌లు ఏ.మనోహరరెడ్డి వి.రమేష్‌లు పని చేస్తూ విధి నిర్వహణలో మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రభుత్వం నుండి ఫ్లాగ్ ఫండ్ కింద ఇద్దరి కుటుంబాలకు రూ.10 వేలు చెక్కును, ప్రదీప్ కుటుంబానికి రూ.15 వేలు చెక్కును ఎస్‌పి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఆర్.రమణ, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ఆధార్‌తో అనుసంధానం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్


వినతులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్, జెసి తదితరులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఓటరు జాబితా ఆధార్‌తో అనుసంధానం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జెసి నిశాంతి, డిఆర్ఒ పుల్లయ్య, ఇతర జిల్లా ఉన్నతాధికారులు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికంగా దరఖాస్తులు వస్తున్న ఆయా మండలాల సచివాలయాలకు తహశీల్దార్లు స్వయంగా వెళ్లి ఎందుకు పరిష్కారం కావడం లేదో గుర్తించి వచ్చే సోమవారం సమావేశానికి నివేదికలు ఇవ్వాలని ఆర్డీవోలను, తహశీల్దార్లను ఆదేశించారు. ఓటర్ల జాబితా ఆధార్ అనుసంధానానికి సంబంధించి ఇంకా జిల్లా వ్యాప్తంగా 2,51,245 మంది ఓటర్ల ఫామ్-6 బి పెండింగ్‌లో ఉందని, బిఎల్‌ఓల వారిగా రోజువారి లక్ష్యాలు కేటాయించి ఈనెల 30 తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని మండలాలకు స్పెషల్ అధికారులను కేటాయించామన్నారు. నాడు-నేడు కింద చేపట్టిన స్కూళ్లను ర్యాండంగా చెక్ చేసి తాగునీరు, టాయిలెట్, రన్నింగ్ వాటర్, మెనూ ప్రకారం ఆహార పదార్థాల సరఫరా, ఎలక్ట్రిఫికేషన్, ఫైర్ ఎగ్జిస్టింగ్ మిషన్ తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించి వచ్చే నెల 6వ తేదీలోగా నివేదికలు అందజేయాలని సూచించారు. మున్సిపల్ పట్టణాల్లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు తనిఖీలు నిర్వహించి నివేదికలు ఇవ్వాలన్నారు. ఈ నెల 29వ తేదీ కర్నూలు జిల్లా పరిషత్ సమావేశంలో తాగునీరు, భూగర్భ జలాలు, హౌసింగ్, పశుసంవర్ధకం తదితర అజెండా అంశాలపై సమావేశం ఉంటుందని, సంబంధిత అంశాలపై నోట్స్‌ను తయారు చేసి సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని చెంచు గూడెంలను దత్తత తీసుకున్న అధికారులు సందర్శించి సంబంధిత గూడెంలలో సమస్యలు చేపట్టాల్సిన సదు పాయాలపై నివేదికలు తయారు చేయాలన్నారు. పగిడ్యాల మండలం బీరవోలు గ్రామంలో కెసి కెనాల్ ప్రక్కన బ్రిడ్జి సమీపంలో ఉన్న కల్లు దుకాణంలో వ్యక్తులు కల్లు తాగి చుట్టు పక్కల వారిని అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడు తున్నారని, కల్లు దుకాణాన్ని తొలగించాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో వసతులు శూన్యం

- మూడు నెలలుగా ఒక్కరూ చేరని వైనం
- అదే అభివృద్ధిగా చూపుతున్న ఎమ్మెల్యే
- టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

నంద్యాల ఎస్ఆర్‌బిసి కాలనీలో నిర్మించిన టిడ్కో గృహాలలో మౌలిక వసతులు లేకుండా ఆడంబరంగా ప్రారంభించి అదే అభివృద్ధి అని నంద్యాల సండే ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి చూపుతున్నారని టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి విమర్శించారు. సోమవారం నంద్యాలలోని ఎస్ఆర్‌బిసి కాలనీలోని టిడ్కో గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలు అవుతున్నా ఒక్కరు కూడా నివాసం లేరని, ఎందుకు చేరలేకపోతున్నారని, ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందనే దానిపై నంద్యాల సండే ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తన తండ్రి భూమా నాగిరెడ్డి ఎమ్మెల్యేగా టిడిపి అధికారంలో ఉన్నప్పుడు టిడ్కో గృహాలను 95 శాతం పనులు పూర్తి చేశారని, మిగిలిన 5 శాతం పనులు నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నా పూర్తి చేయలేని చేతగాని ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పరిస్థితి అన్నారు. భూమా నాగిరెడ్డి కల, ఆశయం నంద్యాల ప్రజలకు 13 వేల ఇల్లు కట్టించి సొంతింటి కల నెరవేర్చాలని, రోడ్ వైడింగ్ చేయాలని, తన తండ్రి ఆశయాన్ని మళ్లీ టిడిపి అధికారంలోకి వస్తుందని, తమ చేతుల మీదుగానే పేదలకు గృహాలను పంపిణీ చేసి నెరువేరుస్తామన్నారు. అలాగే నంద్యాల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయాలని అమృత్ స్కీం కింద ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని నాడు 90 శాతం పనులు పూర్తి చేశామని, మిగిలిన 10 శాతం కూడా పూర్తి చేయలేకపోవడం దారుణమన్నారు. సమస్యలు పట్టించుకోకుండా, వారి స్థలాలకు విలువలు పెంచుకునేందుకు మెడికల్ కాలేజీ కట్టిస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్ప నంద్యాల ప్రజలకు ఏమి చేయలేని చేతగాని ఈ సండే ఎమ్మెల్యే అంటూ ఘాటుగా విమర్శలు గుప్పించారు. ఈసారి అధికారంలోకి వచ్చేది టిడిపి ప్రభుత్వమేనని, భూమా నాగిరెడ్డి ఆశయాలను నెరవేరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శివశంకర్, గంగిశెట్టి విజయ్ కుమార్, బాల అకాడమీ రవి, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పునరావృతం కారాదు : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్పందన ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం నంద్యాలలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి ఎస్పీ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎక్కువగా సివిల్, అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు మొదలగు ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యలను జిల్లా కార్యాలయానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్.రమణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పి రామంజి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత ప్రకృతి వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి పూణే వారి సహకారంతో వీర మురళీధర్ రెడ్డి ఫౌండేషన్, ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆళ్లగడ్డ, అనంత జూనియర్, డిగ్రీ కళాశాలలు కలిసి సంయుక్తంగా ఉచిత ప్రకతి వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. అంగన్వాడి టీచర్లకు, మహిళలకు డాక్టర్ వీరమురళీధర్ రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ రకాల వ్యాధులు రుగ్మతలతో బాధపడే వారికి సలహాలు సూచనలు అందించి పరిష్కారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదవ ప్రకృతి వైద్య దినోత్సవాల్లో భాగంగా భారతదేశ వ్యాప్తంగా వేయికి పైగా నేచురోపతి వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. అనంత డిగ్రీ కళాశాల అధినేత రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి మనకు అందించిన పండ్లు, ఆకుకూరలను దినచర్యలో భాగంగా తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ రవీంద్ర ప్రసాద్, సిడిపిఓ తేజేశ్వరి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా

కానాల విజయశేఖర్ రెడ్డి నామినేషన్

ప్రజాశక్తి - నంద్యాల లీగల్

నంద్యాల అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి స్థానిక న్యాయవాదుల సంఘం కార్యాలయంలో విజయ శేఖర్ రెడ్డి సోమవారం నామినేషన్ వేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులమత బేధం లేకుండా న్యాయవాదులందరికీ వృత్తిలో ఎటువంటి ఇబ్బంది లేకుండా పోరాడుతానని తెలిపారు. బార్ అసోసియేషన్ గతంలో తీసుకున్న ప్రతి తీర్మానానికి పూర్తిగా అమలు పరుస్తూ ముందుకు కొనసాగుతానని చెప్పారు. మహిళా న్యాయ వాదులందరికి వృత్తి విషయంలో, బార్ రూంలో వారికి ఇంకా మెరుగైన సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు.


నామినేషన్ వేస్తున్న కానాల విజయశేఖర్ రెడ్డి

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - మహానంది

రైతులు పండించిన అన్ని రకాల పంటలకు మద్దతు ధర చెల్లించే విధంగా పార్లమెంటులో చట్టం చేయాలని కోరుతూ ఏప్రిల్ 5న అఖిల భారత కిసాన్ సభ, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘంల ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం మండలంలోని గాజులపల్లె గ్రామంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక కర్షక ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా, బహిరంగ సభ, మహా ప్రదర్శనలో జిల్లాలోని రైతులు, కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాసం నాయకులు శ్రీ రమణ, సిఐటియు నాయకులు మద్దిలేటి, సిపిఎం కార్యకర్తలు బాషా, సుబ్బరాయుడు, నాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఛలో ఢిల్లీని జయప్రదంచేయాలని కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పెట్రోల్ బంకును ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల మండలంలోని భీమవరం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషాలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార కేంద్ర బ్యాంకులు రైతులకే కాకుండా మహిళా పొదుపు సంఘాలకు, చిన్న వ్యాపారస్తులకు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసుకోవడానికి తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తున్నారని తెలిపారు. సహకార కేంద్ర బ్యాంకులు అందిస్తున్న వివిధ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పోలూరు గ్రామంలో కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయాన్ని, యాలూరులో రైతులకు కమ్యూనిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సహకార బ్యాంకు అధికారులు మాట్లాడుతూ పోలూరు సహకార సంఘం పరిధిలో 21 గ్రామాలు వ్యాపారాలు సాగిస్తున్నాయని తెలిపారు. 2005 సంవత్సరం నుండి మిట్నాల, భీమవరం, చాపి రేవుల సంఘాలను పోలూరు సంఘంలో విలీనం చేశామన్నారు.

పోలూరులో కార్యాలయాన్ని, గోదాము, పాండురంగాపురంలో 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్ ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా సంఘం సభ్యులకు ఫర్టిలైజర్స్ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, ఎంపిపి శెట్టి ప్రభాకర్, కెడిసిసి బ్యాంక్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీ, బ్యాంకు ఎండిలు, అధికారులు, భీమవరం వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచి, నాయకులు పాల్గొన్నారు.


పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే తదితరులు

ప్రాజెక్టులు చేపట్టాలని సిపిఐ నిరసన దీక్ష

ప్రజాశక్తి - నంద్యాల

పోలవరం ప్రాజెక్టను ఎత్తు తగ్గించకుండా నిర్మించాలని, నిర్వాసితులకు పరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలని, సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం నంద్యాల కలెక్టరేట్ ముందు నిరసన దీక్ష చేపట్టారు. రెండు రోజులపాటు చేపట్టే దీక్షకు మొదటిరోజు సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ అధ్యక్షత వహించారు. దీక్షనుద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు తొలిదశ నిర్మాణం 41.15 మీటర్లు ఎత్తు వరకే అంటూ కేంద్ర జల శక్తి శాఖ సహాయ మంత్రి ప్రహల్లాద సింగ్ పటేల్ పార్లమెంటులో చేసిన ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే సిఎం అర్ధాంతరంగా ప్రధాని నరేంద్ర మోడీని కలిశారని, అక్కడేమో పోలవరం ప్రాజెక్టు కేటాయించాలని పేపర్ ప్రకటన ఇస్తూ, అంతర్గతంగా పులివెందులలో మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసు నుండి బయటపడేందుకు అవినాష్ రెడ్డిని కాపాడేందుకు ప్రయత్నం తప్ప నిజాయితీగా 32 మంది ఎంపీలు ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టిగా ఎందుకు ప్రశ్నించలేక పోతుందని ప్రశ్నించారు. మొదటిరోజు దీక్షకు టిడిపి తరపున ఖలీల్ ఆధ్వర్యంలో మద్దతు తెలియజేశారు. ఈ దీక్షలో సిపిఐ, అనుబంధ ప్రజా సంఘాల నాయకులు కూర్చున్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, ఆళ్లగడ్డ కార్యదర్శి భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, జిల్లా సమితి సభ్యులు చెన్నయ్య పాల్గొన్నారు.


దీక్షలు ప్రారంభిస్తున్న రాష్ట్ర నాయకులు రామాంజనేయులు

30న జీ డ్రామా జూనియర్స్ ఆడిషన్స్

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

జీ డ్రామా జూనియర్స్ సీజన్-6 కోసం 30న కర్నూలులో ఆడిషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో నటనపై ఆసక్తిగల చిన్నారులతో పాటు సంగీతంపై మక్కువ ఉన్న వారికి ఇదే చక్కని అవకాశమని తెలిపారు. కర్నూల్ రైల్వే స్టేషన్ కాంపౌండ్‌లోని హెూటల్ ప్రైమ్ ల్యాండ్‌లో 30న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆడిషన్లు నిర్వహించనున్నా మన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పిల్లల్లోని నటనా ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో విజయవంతంగా 5 సీజన్లను పూర్తి చేసుకున్న డ్రామా జూనియర్స్ ఆరో సీజన్ ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభించిం దన్నారు. ప్రతిభగల గాయనీ గాయకులనూ ఆడిషన్‌కు ఆహ్వానిస్తోందన్నారు. 3 నుంచి 13 సంవత్సరాల వయస్సు ఉండి నటనపై ఆసక్తి ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తరువాతి వారాల్లో విజయవాడ, రాజమహేంద్రవరం, తిరుపతి, విశాఖపట్నం, నెల్లూరు, ఖమ్మం, కరీంనగర్, హనుమకొండ నగరాల్లో కూడా ఆడిషన్లు నిర్వహించనున్నామన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే 9154984009 నెంబరుకు కాల్ చేయాలని కోరారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి రథోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవాన్ని (రావడం) అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈనెల 26వ తేదీన చౌడేశ్వరి దేవి ఉత్సవ మూర్తులను రథంలో ఎక్కించి గ్రామంలోకి రథోత్సవం నిర్వహించారు. గ్రామంలో ఉన్న రథాన్ని దేవస్థానం వరకు భక్తులు లాగుతూ రథోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో రథోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.


రథాన్ని లాగుతున్న భక్తులు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చలో ఢిల్లీని జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఏప్రిల్ 5వ తేదీన జరుగుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు వై ఎల్లయ్య, వైఎ వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆర్ ఈశ్వరయ్యలు కోరారు. స్థానిక బేతంచెర్ల మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయం నందు బేతంచెర్ల పట్టణ అధ్యక్షుడు ఎన్ .బాలయ్య, సీనియర్ నాయకులు ఎస్ సాదిక్ హుస్సేన్ అధ్యక్షతన చలో ఢిల్లీ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు గుంతకల్ బాష, భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎస్‌కె బాష, చిన్న వ్యాపారుల సంఘం నాయకులు రాజులు, నరసింహులు, లారీ వర్కర్స్ నాయకులు జె శ్రీనివాస్, రామన్జనేయులు, బాషా, నరసింహులు, మధు, నాగరాజు, వెంకటేశ్వర్లు, అంకాలు, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న దృశ్యం

నూతన భవన నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

పట్టణంలోని గాంధీ సెంటర్‌లో కామ్రేడ్ జీవి కొండారెడ్డి స్మారక గ్రంధాలయం పైన నూతన భవన నిర్మాణానికి కోవెలకుంట్ల ఉప సర్పంచ్ జిసిఆర్ సూర్యనారాయణ రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయం నిర్వాహకుడు సుబ్బారెడ్డి, కుందూ పోరాట సమితి, తాలుకా యువ సమాఖ్య నాయకుడు కామిని వేణు గోపాల రెడ్డి, మాజీ అధ్యక్షులు ముడిమేల శివ శంకర రెడ్డి, ఎపిటిఎఫ్ మాజీ నాయకుడు రామచంద్రరాజు, రాయలసీమ కళా వేదిక కార్యదర్శి అప్పపోగు వెంకట సుబ్బయ్య, ఎపి ఆర్‌టిసి విశ్రాంత సంఘం నాయకుడు మహేశ్వరావు, మాజీ ఫైర్ ఆఫీసర్ చెన్న కృష్ణారెడ్డి, వార్డు మెంబర్ పోలయ్య, వైర్‌లెస్ ఆఫీసర్ శ్రీనివాసులు, మాజీ బ్యాంకు ఆఫీసర్లు సుకూర్, ఖాసీం, ఎమ్మార్పీఎస్ నాయకుడు సుబ్బయ్య, ఎపి కూలీ సంఘం నాయకుడు ఎగ్గొని ఓబులేసు, యువ సమాఖ్య సభ్యులు కరీం బాషా, నూరబాషా, రామ్ పుల్లయ్య, జాఫర్, కాశీం, టైలర్ మాబు, సంటి రెడ్డి, నాగయ్య, బాబు, మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రేపు వేలంపాటలు

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచర్ల నగర పంచాయతీ కార్యాలయంలో ఈనెల 28వ తేదీన మంగళవారం ఉదయం సంత మార్కెట్ బండ్లమెట్ట చిన్న కబేలా పెద్ద కబేలా వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు సోమవారం తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరానికి సంబంధించిన వేలం పాటలు నగర పంచాయతీ నిర్ణయించిన మేరకే వేలంపాటలో పాల్గొనే వేలంపాటాదారులు నగర పంచాయతీలో దార వత్తు చెల్లించి పాల్గొనాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు వేలంపాటలో పాల్గొనేవారు నగర పంచాయతీ అధికారులను సంప్రదించవచ్చు అని ఆయన తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న సర్పంచి, ఉప సర్పంచి

సిసి రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - శిరివెళ్ల

శిరివెళ్లలోని ఎస్సీ కాలనీలో వేస్తున్న ప్రధాన రహదారి సిసి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచి లక్కాకుల సాలమ్మ చంద్ర, ఉప సర్పంచి బసాపురం ఇంతియాజ్‌లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌సి కాలనీ ప్రజలు వర్షాకాలంలో బురదమయంగా మారిన దారిలో రాకపోకలకు తీవ్ర అవస్థలు పడేవారని, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డిలు కాలనీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి నాయక్ నజీర్, వక్ఫ్ బోర్డు మాజీ జిల్లా ఉపాధ్యక్షులు బసాపురం అబ్దుల్ సలాం, వార్డు మెంబర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలి

- జెంసి నాయకులు సత్యదీప్

ప్రజాశక్తి - బేతంచర్ల

రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ఏపీ జేఏసీ చేపట్టిన ఉద్యమంలో ప్రతి ఉద్యోగి భాగస్వామ్యం కావాలని జెఏసి నాయకులు సత్యదీప్ పేర్కొన్నారు. సోమవారం బేతంచెర్ల మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్యదీప్, ఆర్ఐ శ్రీదేవి మాట్లాడారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంకై ఎపి జెఏసి చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా వర్క్ టు రూల్ కార్యక్రమాన్ని ఈనెల 21వ తేదీ నుండి చేపట్టడం జరిగిందని అన్నారు. కరోనా సమయంలో మరణించిన ఉద్యోగుల స్థానంలో కారుణ్య నియామకాలు జరపాలని ప్రభుత్వానికి ఎన్నోసార్లు విన్నవించిన స్పందించకపోవడం విచారకరమని వారు అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలో పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా చిన్న స్థాయి ఉద్యోగుల నుండి ఉన్నత స్థాయి ఉద్యోగుల వరకు అందరు కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీదేవి, జూనియర్ అసిస్టెంట్ అశోక్, వీఆర్‌ఏ నాగేష్, సురేష్, విఆర్ఓ శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెఏసి నాయకులు సత్యదీప్

మహిళలు ప్రభుత్వానికి అండగా నిలవాలి

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

డ్వాక్రా సంఘాల మహిళలు వైసిపి ప్రభుత్వానికి అండగా ఉండాలని శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలం లోని పార్నపల్లి గ్రామంలో టిటిడి కళ్యాణ మండపంలో వైయస్సార్ ఆసరా పథకం మూడో విడత చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలన్నారు. మండలంలో 773 డ్వాక్రా మహిళా సంఘాలకు రూ 4 కోట్ల 92 లక్షల 941ల చెక్కును విడుదల చేశారు. ప్రతి కుటుంబం ప్రభుత్వ ప్రతిఫలాలను పొందేలా ఈ సంక్షేమ క్యాలెండర్లను రూపొందిం చడం జరిగిందన్నారు. ప్రతిపక్ష నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాలంటే ముఖ్యమంత్రి జగన్‌కు అండగా ఉండాలని ఆయన కోరారు. డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలోని డ్వాక్రా సంఘాలకు పెద్ద మొత్తంలో ఆసరా నిధులు రావడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాల్లో నంద్యాల జిల్లానే మొదటి స్థానంలో ఉందని, బ్యాంకు రికవరీలోనూ ప్రథమ స్థానంలోనే ఉందని తెలిపారు. మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు డి చిన్న సంజీవరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రభుత్వ నిధులే కాకుండా తన సొంత నిధులతోనూ ప్రజలకు సేవ చేయడంలో మొదటి స్థానంలో ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో శిల్పా చక్రపాణి రెడ్డికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, సర్పంచ్ జెడ్పిటిసి సభ్యురాలు బారెడ్డి తులసమ్మ, మాజీ జెడ్పిటిసి చిన్న మద్దిలేటి, రైతు సంఘం సలహా మండల అధ్యక్షుడు కృష్ణ, మల్లారెడ్డి, వెలుగు ఏపీఎం రాజశేఖర్ రెడ్డి, తహశీల్దార్ ఉమారాణి, డ్వాక్రా సంఘాల అధ్యక్షులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



వైయస్సార్ ఆసరా పథకం చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా

ఆత్మకూర్ : రాష్ట్రంలో మహిళలు స్వయం ఉపాధి అవకాశాలతో ఆర్థికంగా ఎదగాలని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అన్నారు. పట్టణంలోని 5, 6, వార్డుల పరిధిలో మూడో విడత ఆసరా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మెప్మా పట్టణ కోఆర్డినేటర్ భారతి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరుపేద కుటుంబాల అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని అన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, సచివాలయ ఉద్యోగులు, పొదుపు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



చికెన్ షాప్ యజమానులు నిబంధనలు పాటించాలి

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని చికెన్ షాప్ యజమానులు అందరూ మున్సిపాలిటి నిబంధనలు పాటించాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సూచించారు. సోమవారం డోన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన పట్టణంలో చికెన్ షాప్ లలో అధిక ధరల కు చికెన్ విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు మున్సిపల్ కార్యాలయం నందు చికెన్ షాప్ యజమానుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్చిన చికెను రూ.200, కాల్చని చికెన్ రూ.180లుగా విక్రయించాలని షాపు యజమానులకు ఆదేశించారు. చికెన్ వ్యర్థపదార్థా లను కాలువలలో ఖాళీ ప్రదేశాలలో వేయకూడదని సూచించారు. చికెన్ వ్యర్థ పదార్థాలను మున్సిపల్ శాఖ వారికి అప్పగించాలని సూచించారు. నిబంధనలు పాటించని యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్సై శరత్ కుమార్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు,పట్టణ ఏఎస్ఐ గోపాల్, చికెన్ షాప్‌ల యజమానులు పాల్గొన్నారు.



చికెన్ షాప్ యజమానులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

1న వృషభాల బండలాగు పోటీలు

- 31న పొట్టేళ్ళ పోట్లా, 30న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ

ప్రజాశక్తి - పగిడ్యాల

శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ఏప్రిల్ 1వ తేదిన పగిడ్యాల గ్రామంలో వృషభాల బండలాగు పోటీలు నిర్వహిస్తునట్లు నిర్వహకులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మొదటి బహుమతి రూ 50 వేలు, రెండవ రూ 40 వేలు , మూడవ రూ 30 వేలు, నాల్గవ రూ 20 వేలు, ఐదవ రూ 10 వేలు, ఆరవ బహుమతి రూ 5 వేలు చొప్పున గెలుపు పొందిన వృషభ రాజుల యజమానులకు బహుమతులను ప్రదానం చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే వృషభ యజమానులు ప్రవేశ రుసుం రూ 500 చెల్లించాలన్నారు. భోజన వసతి కల్పించడం జరుగుతుంద న్నారు. వివరాల కోసం నాగేశ్వరరెడ్డి 9949493857, భాస్కర్‌రెడ్డి 9989492112, లక్ష్మిరెడ్డి 6304759065, శ్రీనివాసరెడ్డి 9866462272 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

31న పొట్టేళ్ళ పోట్లాట పోటీలు

శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని పగిడ్యాల గ్రామంలో ఈ నెల 31 పొట్టేళ్ళ పోట్లాట పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి బహుమతికి రూ 8వేలు, రెండవ, మూడవ, రూ నాల్గవ బహుమతులకు 6వేలు, రూ 4 వేలు, రూ 2 వేలు చొప్పున పొట్టేళ్ళ యజమానులకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు.

పోటీల్లో పాల్గొనే పొట్టేళ్ళ యజమానులు రూ 200 ప్రవేశ రుసుం చెల్లించి ఈ నెల 31 వతేది ఉదయం 7 గంటలలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

30న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఈ నెల 30న పగిడ్యాల గ్రామంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.

మొదటి బహుమతి రూ 20 వేలు, రెండవ బహుమతి రూ15 వేలు,మూడవ బహుమతి రూ 12 వేలు, నాల్గవ బహుమతి రూ 10 వేలు, ఐదవ బహుమతి రూ 8వేలు, ఆరవ బహుమతి రూ 5 వేలు గెల్పుందిన జట్లకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఈ పోటిలలో పాల్గొనే జట్లు రూ 400 ప్రవేశ రుసుము చెల్లించాలన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన సౌకర్యం ఉంటుందన్నారు.



పాములపాడు : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిరు ధాన్యాలతో రక్తహీనత నివారణ

ప్రజాశక్తి - వెలుగోడు

చిరు ధాన్యాలతో రక్తహీనతను నివారిద్దాం అని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సూర్య కుమారి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెల్పనూరు గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం తరుపున చిరుధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ డి.పి.సూర్య కుమారి చిరుధాన్యాలు, రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, స్కూల్ ప్రిన్సిపాల్ నాగమణ, టీచర్ లింగన్న, తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు:** చిరుధాన్యాలలో పోషకాలు ఉండడంతో చిన్నారులకు ఎదుగుదల ఉంటుందని ఐసిడిఎస్ వేంపెంట సెక్టార్ సూపర్వైజర్ అంజలీదేవి అన్నారు. మండలంలోని భానుముక్కల గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఎంపీ యూపీ స్కూల్ నందు చిరుధాన్యాల ప్రదర్శన నిర్వహించి, వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. రక్తహీనతను అధిగమిస్తారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు వినీల రాణి, ఏఎన్ఎం కృష్ణవేణి, అంగన్వాడి టీచర్లు స్వాతి, మునెమ్మ, ఆశ వర్కర్ కవిత, తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** మండలంలోని వెంకటాపురం ఉన్నత పాఠశాల జిల్లా పాఠశాల నందు పోషణ పక్వాడ కార్యక్రమం భాగంగా కిశోర బాలికలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. బైర్లుటి పిహెచ్‌సి డాక్టర్ గోపాల్ పాల్గొని బాలికలకు చిరుధాన్యాలు గురించి తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యా యులు శాహనాజ్ బేగం, వెంకటాపురం, కృష్ణాపురం, అంగన్వాడీ కార్యకర్తలు, కవిత, శివలింగమ్మ, మేరీ మణి కుమారి, బుజ్జి, కళావతి, ఆదిలక్ష్మి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి బాటలో పల్లెలు

- ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - రుద్రవరం

వైసిపి పాలనలో ప్రతి పల్లె ప్రగతి సాధించిందని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో రూ.4.30 కోట్ల పైగా నిధులతో నిర్మించిన 26 అభివృద్ధి పనులను వారు ప్రారంభించారు. చిత్రేనిపల్లిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ ఆరోగ్య కేంద్రం, ఆలమూరులో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, నల్లవాగుపల్లెలో సీసీ రోడ్డు, నక్కలదిన్నెలో బిటి రోడ్డు, టి.లింగం దిన్నెలో కాంపౌండ్, బి.నాగిరెడ్డి పల్లిలో సిసి రోడ్డు, ఎర్రగుడిదిన్నెలో వైయస్సార్ ఆరోగ్య కేంద్రం, రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకు, పశు వైద్యశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, శ్రీరంగాపురంలో సచివాలయం, ఎల్లావత్తులలో సచివాలయం, కోటకొండలో రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ ఆరోగ్య కేంద్రం, కే కొత్తూరులో సిసి రోడ్లకు ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, వైసీపీ నాయకుడు గంగుల విజయసింహారెడ్డి, నోడల్ అధికారి డాక్టర్ గిడ్డయ్య, పి ఆర్ ఏ ఈ వెంకట రాముడు, హౌసింగ్ ఏఈ నాగరాజు, డాక్టర్లు అమర్నాథరెడ్డి, వినయ్, సర్పంచులు వరలక్ష్మి, పాణ్యం లక్ష్మీదేవి, మాధవ, పాణ్యం నాగేష్, చంద్ర, డేగాని వెంకటేష్, రామకష్ణ, నరసింహయ్య, మోహన్ రెడ్డి, హరి నారాయణ, తిరుపతిరెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎమ్మెల్యే



వేలంపాటలు నిర్వహిస్తున్న అధికారుల

ముమ్మరంగా వేలంపాటలు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోనే గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీకి వేలంపాటల్లో రూ.22 లక్షల 69 వేలు ఆదాయం వచ్చినట్లు గ్రామపంచాయతీ ఇఒ ఖలీల్ బాష తెలిపారు. వేలంపాటలను నిర్వహించారు. సోమవారం పట్టణంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో శివరామయ్య, గ్రామ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, ఇఒల ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించారు. దినసరి వారం సంత మార్కెట్ వేలంపాటలు, నిలపబడిన వాహనాల స్టాండు జంతు వధశాలలకు వేలం పాటలో నిర్వహించారు. 2023 ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి 2024 మార్చి 31 వతేదీ వరకు రుసుము వసూలు చేసుకునేందుకు వేలంపాటలు నిర్వహించారు. దినసరి వారపు మార్కెట్ వేలంపాటను రూ.11 లక్షల 76 వేలకు షేక్ మహబూబ్ షా, నిలపబడిన వాహనాల స్టాండును రూ.10 లక్షల 11 వేలకు షేక్ మహబూబ్ షా, జంతు వధశాలను రూ.82 వేలకు షేక్ మహబూబ్ షా అధిక వేలానికి పాడి దక్కించుకున్నట్లు గ్రామపంచాయతీ ఇఒ ఖలీల్ బాష తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ డి బాబు సాహెబ్, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వరయ్య, సుభాషిని, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శిరివెళ్ల : మండల పరిధిలోని నల్లమల అడవి సమీప గ్రామమైనటువంటి మహదేవ పురంలో సోమవారం జరిగిన గ్రామపంచాయతీ వేలం పాటలు పోటాపోటీగా జరిగాయి. ఈఓపిఆర్డి సాల్మన్ రాజ్, సర్పంచ్ పెద్ది రమణయ్య, పంచాయతీ కార్యదర్శి బట్టు కుమార్, తదితరుల అధ్యక్షతన జరిగిన వేలం పాటలకు విశేష స్పందన లభించింది. గతంలో ఐదు లక్షల 12 వేల రూపాయలకు అధిక వేలంపాటదారుడు కైవశం చేసుకోగా, నేడు 7లక్షల 2,000 రూపాయలకు షేక్ బాషా అను వ్యక్తి అధిక పాతదారునిగా నిలిచాడు. గ్రామపంచాయతీకి రూ. 1,90,000 అధిక ఆదాయం వచ్చినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి బట్టు కుమార్ సూచించారు.

మామ, భర్త అడుగుజాడల్లోనే : చల్లా శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - అవుకు

'మా మామ దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి, నా భర్త దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి అడుగుజాడల్లోనే నడుస్తూ ప్రజలకు మరింత సేవ చేస్తా' అని జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం అవుకు పట్టణంలో వైసిపి నూతన కార్యాలయాన్ని ఇద్దరు కుమారులు చల్లా రాజ్యాభిషేక్ రెడ్డి, చల్లా జూనియర్ రామకృష్ణారెడ్డిలతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడారు. తమ కుటుంబానికి పెద్ద దిక్కు అయిన తన మామ చల్లా రామకృష్ణారెడ్డి, భర్త చల్లా భగీరథరెడ్డిలు తమ మధ్య లేకపోయినా వారి అభిప్రాయాలకు అనుగుణంగా వారి అడుగుజాడల్లోనే నడుస్తూ ముందుకు సాగుతానని తెలిపారు. తనకు పదవులు ముఖ్యం కాదని, ప్రజాసేవే ధ్యేయమని అన్నారు. నిరంతరం ప్రజల కోసం పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ప్రజలకు పార్టీ కార్యాలయంలో ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలకు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. రాజకీయ నాయకులు, పత్రిక యాజమాన్యాలు, పార్టీ రాష్ట్ర క్యాడర్‌లోని ముఖ్య నాయకులు తనకు మద్దతుగా నిలిచి ధైర్యం చెప్పడంతో రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్నానని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలను తప్పకుండా పాటిస్తూ ప్రజలతో కలిసి వారి సమస్యలను పరిష్కరించడమే తన వంతు బాధ్యతగా పని చేస్తానని చెప్పారు. తనకు అండగా నిలిచి తనకు ధైర్యాన్ని కల్పిస్తున్న చల్లా విక్రాంత్ రెడ్డి, చల్లా సాయి చరణ్ రెడ్డి, చల్లా సాయి చైతన్య రెడ్డి, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వైసిపి అభిమానులకు, కార్యకర్తలకు మిఠాయిలు పంచి పెట్టారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చల్లా శ్రీలక్ష్మి

ఎంపిడిఒ భాగ్యలక్ష్మి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మండల పరిషత్ కార్యాలయంలో ఇన్చార్జ్ ఎంపీడీవోగా అదనపు బాధ్యతలను రుద్రవరం మండలం ఈవోపీఆర్డి భాగ్యలక్ష్మి సోమవారం చేపట్టారు. చాగలమర్రి ఎంపీడీవోగా ఉన్న షంషాద్బాను పదోన్నతిపై వెళ్లడంతో అప్పటి నుంచి ఏవో చంద్రశేఖర్ ఇన్చార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రుద్రవరం మండలం ఈవోపీఆర్డీ భాగ్యలక్ష్మిని చాగలమర్రి మండల ఇన్చార్జ్ ఎంపీడీవోగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటి, పారిశుధ్య సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని తెలియజేశారు.



బాధ్యతలు చేపట్టిన భాగ్యలక్ష్మి

పంట రుణాలు సకాలంలో చెల్లిస్తే సున్నా వడ్డీ

- సింగిల్ విండో సొసైటీ సీఈవో భాస్కర్

ప్రజాశక్తి - పాములపాడు



పంట రుణాలు తీసుకున్న రైతులు ఈనెల 30వ తేదీ లోపల రుణాలు చెల్లిస్తే వారికి సున్నా వడ్డీ వర్తిస్తుందని వేంపెంట సింగిల్ విండో సొసైటీ సీఈవో భాస్కర్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతులు ఈనెల 30 లోపు చెల్లిస్తే వారికి అపరాధ రుసుము ఉండదన్నారు. మండలంలో సొసైటీ పరిధిలో పంట రుణాలు తీసుకున్న రైతులు సుమారు 800 మంది రైతులు ఉన్నారని, వారిలో 60 శాతం రెన్యువల్ చేశారన్నారు. రైతు నేస్తం పథకం కింద రుణాలు తీసుకున్న 138 మంది లబ్ధిదారుల నుండి 95 శాతం రికవరీ చేశామన్నారు. రాజన్న చేయూత పథకం కింద రుణాలు తీసుకున్న 51 మంది లబ్ధిదారుల నుండి 90 శాతం రికవరీ చేశామని తెలిపారు. పాడి పరిశ్రమ దీర్ఘకాలిక రుణాల బకాయిలను 50 శాతం రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను పి.అర్.బుచ్చి ఓబుల్ రెడ్డి చారిటబుల్ ట్రస్టు, నందన చక్రవర్తి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సోమవారం మండలంలోని నందవరం గ్రామంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను చౌడేశ్వరి దేవి దేవస్థానం మాజీ చైర్మన్ , పి.అర్.బుచ్చి ఓబుల్ రెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పి.ఆర్. వెంకటేశ్వర రెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులను పిఆర్ వెంకటేశ్వర రెడ్డి పరిచయం చేసుకొని టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో 30 జట్టులు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పి.ఆర్ .వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండోవ బహుమతి రూ20 వేలు, మూడో బహుమతి రూ 15 వేలు, నాలుగవ బహుమతి రూ10 వేలు, ఐదవ బహుమతి రూ5000, ఆరవ బహుమతి రూ2000 ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా భావించి క్రీడా స్ఫూర్తిని అవలంబించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు పి.బి.గణేష్ యాదవ్,లోకేష్ రెడ్డి, సురేంద్ర రెడ్డి,ప్రశాంత్, గోవింద్, ప్రసాద్ యాదవ్, పిఆర్ బుచ్చి ఓబుల్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్, నందన చక్రవర్తి సేవా సమితి సభ్యులుపి.అర్. పార్థ సారధి రెడ్డి, వెంకటేశ్వరల్లు,భాస్కర్ రెడ్డి, హరి కృష్ణ, శ్రీనివాసులు, శేఖర్,మురళీ తదితరులు పాల్గొన్నారు.



సుబ్బారాయుడు స్వామి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీ కొత్తూరు సుబ్బారాయుడు స్వామి హుండీ ఆదాయంను సోమవారం లెక్కించారు. హుండి లెక్కింపు ద్వారా స్వామి వారికి రూ.20 లక్షల 53 వేల 832లు నగదు, 3 గ్రాముల బంగారం, 1 కేజి 760 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ ఇఒ రామకృష్ణ తెలిపారు. ఈ ఆదాయం డిసెంబర్ 15 నుండి మార్చి 27వ వరకు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దేవాదాయశాఖ అధికారులు చక్ర భరత్, దేవస్థానం సిబ్బంది సుబ్బారెడ్డి, గ్రామ పెద్దలు కృష్ణారెడ్డి, మిలట్రీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రైతుల భూములు లాక్కుంటే ఉద్యమం : సిపిఐ

ప్రజాశక్తి - గడివేముల

అనుభవంలో ఉన్న రైతుల భూములు లాక్కుంటే ఉద్యమం తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి రంగా నాయుడు అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కొర్రపోలురు గ్రామంలోని ఎస్ఆర్బిసి కాలువ పక్కన ఉన్న సర్వే నెంబర్ 11లో 220కెవి హైపవర్ సబ్ స్టేషన్ నిర్మించాలన్న పేరుతో బలవంతంగా అనుభవంలో ఉన్న రైతులను కాదని నాయకుల అధికారుల అండదండలతో భూములను ఆన్లైన్‌లో ఎక్కిచుకున్నారన్నారు. అనుభవంలో ఉన్న రైతులను పోలీసులతో బెదిరించారన్నారు. రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ఈ విషయాన్నీ సిపిఐ జాతీయ, రాష్ట్ర నాయకులకు తెలియజేసి ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా పక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రసాద్, ప్రతాప్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అహ్మద్ హుస్సేన్ మండల నాయకులు రాంప్రసాద్,రసూల్,సంజన్న, బాధిత రైతులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని రవ్వలకొండ వద్ద వీరప్పయ్య స్వామి ఆనందాశ్రమంలో నూతనంగా నిర్మించిన గాయత్రీ దేవి, దాక్షాయణి మూర్తి స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి లు పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు వీరప్పయ్య స్వామి ఆనంద ఆశ్రమ పీఠాధిపతి జ్ఞానేశ్వరానంద స్వామి, జ్ఞానేశ్వరామత దేవి ఘన స్వాగతం పలికారు. పూర్ణాహుతిలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రవ్వలకొండ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమరసత సంఘం జిల్లా అధ్యక్షుడు లాయర్ మాధవరెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **ఉయ్యాలవాడ :** మండలంలోని ఆర్.పాంపల్లి గ్రామంలోని గంగమ్మ దేవాలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో రామకష్ణారెడ్డి (ఎంఆర్‌కె), మద్దూరి బ్రదర్స్ ఆహ్వానం మేరకు బిజెపి ఆళ్లగడ్డ ఇన్చార్జి భూమా కిషోర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగపుత్రులు, యాదవులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని